నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644


## నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

నాటి తరమునంత నానమ్మ కథలతో
మంచి చెడుల తెలిసి మసలుకొనియె
నీతిపద్య,కథలు నియమానుసారంగ
చదివుకున్న బ్రతుకు చక్కగుండు

మీ
విజయప్రసాద్ నలువూసు
తెలుగు బోధకులు, కవి


## విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 122 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | 31-7-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00




# భారత్ పై అమెరికా టారిఫ్ మోత

- భారత్‌పై 25 శాతం విధిస్తున్నట్లు వెల్లడి

**వాషింగ్టన్ -జూలై 30(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పట్టు నెగ్గించుకున్నాడు. భారత్‌పై సుంకాల చర్యలకు ఉపక్రమించారు. మన దేశ వస్తువులపై 25శాతం సుంకాలు విధిస్తున్నట్లు- ప్రకటించారు. ఆగస్టు 1 నుంచి ఇవి అమల్లోకి రానున్నట్లు- చెప్పారు. అమెరికా వస్తువులపై భారత్ ఎక్కువ సుంకాలు విధిస్తోందన్నారు. భారత్ మిత్రదేశమే అయినా.. సుంకాలు ఎక్కువగా

-మిగతా 2 లో



## పాక్ ఉగ్రవాదాన్ని వదిలే వరకు సింధూ జలాల రద్దు అమలు చేస్తాం

- నిర్ణయంలో ఎలాంటి వెనకడుగు లేదు
- నీరు, రక్తం కలిసి ప్రవహించవు
- రాజ్యసభలో కేంద్రమంత్రి జైశంకర్ స్పష్టీకరణ

**న్యూఢిల్లీ,**
పాకిస్తాన్‌కు సింధూజలాల నిలిపివేస్తూ తీసుకున్న నిర్ణయంలో ఎలాంటి వెనకడుగు లేదని కేంద్రం స్పష్టం చేసింది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాక్‌పై భారత్ విధించిన ఆంక్షల్లో భాగంగా నిలిపివేసిన సింధూ నదీ జలాల ఒప్పందంపై కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ రాజ్యసభలో బుధవారంనాడు స్పష్టత ఇచ్చారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని శాశ్వతంగా విడిచిపెట్టేంతవరకూ నదీ జాలల ఒప్పందం నిలుపుదలలోనే ఉంటుందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పినట్టుగా నీరు,

-మిగతా 2 లో

# రాష్ట్రంలో మరో కొత్త డిస్కమ్ ఏర్పాటు


**అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు చేయాలి**

- కొత్త డిస్కమ్ పరిధిలోకి ఉచిత విద్యుత్ పథకాలు
- రాష్ట్రమంతా ఒకే యూనిట్ గా కొత్త డిస్కమ్ పరిధి ఉండాలి
- రుణాలపై వడ్డీ భారం తగ్గించేందుకు వెంటనే ప్రణాళిక సిద్ధం చేయాలి
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశాలు

**హైదరాబాద్, జూలై 30(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రాష్ట్రంలో విద్యుత్ విభాగం ప్రక్షాళన చేసేందుకు అవసరమైన సంస్కరణలు అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో కొత్తగా మరో డిస్కమ్ ఏర్పాటు చేయాలని, అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా ఏర్పాటు- చేసే డిస్కమ్‌కు వ్యవసాయ ఉచిత విద్యుత్, 200 యూనిట్ల

-మిగతా 2 లో





## నిసార్ శాటిలైట్ ప్రయోగం విజయవంతం

- భూ ఉపరితలం పరిశీలనలో ఇక విప్లవాత్మక మార్పులు..!

**న్యూఢిల్లీ, -**
నిసార్ ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైంది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ , అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ సంయుక్తంగా అభివృద్ధి చేసిన భూపరిశీలనా ఉపగ్రహం 'నిసార్ ' సక్సెస్‌ఫుల్‌గా అంతరిక్షంలోకి దూసుకెళ్లింది. మొత్తం 2,392 కిలోల బరువున్న ఈ ఉపగ్రహాన్ని భారత్‌కు చెందిన GSLV-F 16 రాకెట్ నిప్పులు చిమ్ముతూ నింగిలోకి మోసుకెళ్లింది. జీఎస్ఎల్‌వీ రాకెట్ నిసార్ ఉపగ్రహాన్ని 740 కిలోమీటర్ల ఎత్తులోని సూర్య అనువర్తిత కక్ష్యలోకి చేర్చింది.బుధవారం సాయంత్రం సరిగ్గా 5:40 గంటలకు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ ఉపగ్రహాన్ని ప్రయోగించారు. ఈ ప్రయోగం కోసం ఇస్రో, నాసా కలిసి మొత్తం 1.5 బిలియన్ డాలర్లను

-మిగతా 2 లో



## స్థానిక విజయం లక్ష్యంగా కాంగ్రెస్ వ్యూహం

- బీసీ రిజర్వేషన్ల బిల్లు గట్టెక్కితేనే నెరవేరనున్న లక్ష్యం
- పార్టీలో ఉత్సాహం నింపేందుకు నేటినుంచి మీనాక్షి పాదయాత్ర

**రంగారెడ్డి**
బిసి రిజర్వేషన్లు ప్రకటించినా..రాష్ట్రపతి ఇంకా ఆమోదించలేదు. దీనిపై కేంద్రాన్ని నిందిస్తూ కాంగ్రెస్ ఉద్యమకార్యాచరణకు సిద్దం అవుతోంది. ఢిల్లీలో ఆందోళన చేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. 42శాతం రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి ఆమోదం కోసం ఎదురు చూస్తోంది. బిజెపి మాత్రం ఇది ఆమోదయోగ్యం కాదనిచెబుతోంది. అందులో ముస్లిం రిజర్వేషన్లు తొలగించాలని చెబుతోంది.

-మిగతా 2 లో

# ఐదు రోజుల్లో రైతులకు 500 రూపాయల బోనస్

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి



**ఖమ్మం, జూలై 30(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రాబోయే ఐదు రోజుల్లోనే రైతులకు ధాన్యం కొనుగోలుకు 500 రూపాయల బోనస్ ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి బాట కార్యక్రమంలో పాల్గొన్న రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 16 లక్షల మంది లబ్ధిదారులని పొందుపరిచామని వెల్లడించారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేకపోయిందని విమర్శించారు. ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చిన 18

-మిగతా 2 లో

## రష్యా సముద్రంలో భారీ భూకంపం

- 8.8 తీవ్రతతో భూకంపం
- రష్యా, అమెరికా, జపాన్ తదితర దేశాల్లో
- భూ ప్రకంపనలు.. సునామీ హెచ్చరికలు
- 12 అడుగుల ఎత్తులో ఎగసిపడుతున్న రాకాసి అలలు
- సురక్షిత ప్రాంతాలకు ప్రజల తరలింపు



**న్యూఢిల్లీ,**
తూర్పు ఆసియా తీర ప్రాంతం%ౌ%ముఖ్యంగా పసిఫిక్ మహా సముద్ర పశ్చిమ తీరంలో రిక్టర్ స్కేలుపై 8.8 తీవ్రతతో బుధవారం తీవ్ర భూకంపం సంభవించింది. దీంతో రష్యా, అమెరికా, జపాన్ తదితర దేశాలకు సునామీ హెచ్చరికలు, అడ్వైజరీలు జారీ అయ్యాయి. సముద్రపు అలలు కాలిఫోర్నియా తీరాన్ని తాకాయి. భూకంపం కారణంగా రష్యాలోని కురిల్ దీవులు, జపాన్ ఉత్తర ప్రాంతంలోని అతి పెద్ద ద్వీపం హక్కైడో, హవాయి తీరంలో సునామీ ప్రభావం కన్పిస్తోంది. ఇండోనేషియా, మలేసియా

-మిగతా 2 లో

# రైతన్నా మేలుకో... అగ్రీ డాక్టర్ల సలహా తీసుకో



- సాగులో నానాటికీ పెరిగిపోతున్న రసాయనాల వినియోగం.
- పురుగు మందుల వినియోగం లో దేశం లోనే మూడవ స్థానం లో తెలంగాణ.
- రైతు భాగస్వామ్యం లేకుండా నియంత్రణ సాధ్యం కాదంటున్న అధికారులు.
- క్రిమి సంహారకాల కొనుగోలుకు అధికారుల చీటి తప్పని సరి చెయ్యాలని నిపుణుల సూచన.

**హైదరాబాద్, జూలై 30(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
దేశానికి అన్నం పెట్టే రైతు సుభిక్షంగా ఉంటే దేశం సుభిక్షంగా ఉంటుంది. ప్రపంచీకరణతో పోటీ పడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా వ్యవసాయ విధానాలను మార్చుకుంటూ సాగు బాటలో ముందుంటున్న రైతులు హరిత విప్లవకాలం నాటి భావజాలాన్ని ఇంకా విడనాడటం లేదు. 20వ శతాబ్ద కాలం లో దేశ ప్రజలను కరువు కాటకాల నుండి బయటపడేసే ఉద్దేశ్యం తో అతితక్కువ కాలంలో అత్యధిక దిగుబడులను సాధించే లక్ష్యం తో దేశంలో సంకర

-మిగతా 2 లో



# రష్యా సముద్రంలో భారీ భూకంపం

(మొదటి తరువాయి)

దేశాలకు కూడా సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి. సునామీ అలలను వీక్షించేందుకు ఎవరూ తీర ప్రాంతం వద్దకు వెళ్లవద్దని అమెరికా జాతీయ వాతావరణ సేవల విభాగం ప్రజలను హెచ్చరించింది. ఫొటోలు తీసేందుకు కూడా ప్రయత్నించొద్దని తెలిపింది. లంగారా ద్వీపాన్ని తాకిన తర్వాత సునామీ అలలు టోఫినోకు చేరుకుంటాయని, ఆ తర్వాత అలల తాకిడి పెరుగుతుందని అధికారులు తెలిపారు. సునామీ హెచ్చరికల నేపథ్యంలో మెరీనాలు, బీచ్‌లు, సముద్రానికి సమీపంలోని ప్రాంతాలలో ప్రజలను ఖాళీ చేయించాలని సూచించారు. కమ్చట్కా ద్వీపకల్పంలో సంభవించిన భూకంపం 1952 తర్వాత వచ్చిన అత్యంత శక్తివంతమైన ఉపద్రవమని నిపుణులు చెబుతున్నారు. మరిన్ని ప్రకంపనలు రావచ్చునని, వాటి తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.5గా ఉండవచ్చునని వారు అంచనా వేశారు. మార్కెస్వాస్ దీవులను సునామీ అలలు నాలుగు మీటర్ల ఎత్తున తాకవచ్చునని ఫ్రెంచ్ పాలినేసియా ప్రజలను హెచ్చరించింది. ఒరేగాన్ సరిహద్దుకు దక్షిణంగా పదిహేను మైళ్ల దూరంలో ఉన్న క్రెస్సెంట్ పట్టణాన్ని మూడున్నర అడుగుల ఎత్తన సునామీ అలలు ముంచెత్తాయి. మరోవైపు సునామీ హెచ్చరికలను జారీ చేసిన కాంబోడియా ప్రభుత్వం పసిఫిక్ తీరం వెంబడి ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించింది. బీచ్‌లను మూసివేశారు. హవాయి అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. వరదనీటిని గమనిస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని సూచిస్తున్నారు. జపాన్, హవాయి, అలాస్కాను తాకిన అలలు కాలిఫోర్నియా తీరాలకు చేరాయి. రష్యాలోని కొన్ని ప్రాంతాలలో భూకంపం కారణంగా భవనాలు దెబ్బతిన్నాయి. న్యూజిలాండ్ ప్రభుత్వం కూడా తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసింది. బలమైన, అసాధారణమైన గాలులు వీయవచ్చునని, అనూహ్య పరిణామాలు సంభవించవచ్చునని హెచ్చరించింది. కొన్ని చోట్ల సునామీ ముప్పు తప్పడంతో అడ్వైజరీలు జారీ చేశారు. రష్యాలోని కమ్చాట్కా ద్వీపకల్పంలో 8.8 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఈ నేపథ్యంలో అధికారులు పసిఫిక్ తీరం అంతటా సునామీ హెచ్చరికలు చేశారు. ముఖ్యంగా అలస్కా, హవాయిల్లో 10 అడుగుల ఎత్తులో అలలు ఎగసిపడే అవకాశం ఉందని చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.
ఉత్తర కురిల్ దీవుల నుంచి హవాయి ద్వీప సమూహం వరకు, అలాగే యూఎస్ పశ్చిమ తీరానికి సునామీ ముప్పు పొంది ఉందని పేర్కొన్నారు. దీంతో తీరంలోని విమానాశ్రయాలను, హార్బర్‌లను మూసివేశారు. ఫ్లైట్స్‌ను క్యాన్సిల్ చేశారు. అంతేకాక అమెరికా వాతావరణ విభాగం కూడా కీలక హెచ్చరిక జారీ చేసింది. సునామీ తీవ్రతను తేలిగ్గా తీసుకోవద్దని, ఫొటోల కోసం తీరానికి వెళ్లవద్దని హెచ్చరించింది. ఒక్క అలతో సునామీ రాదని, అలలు పలుమార్లు వస్తాయని, సముద్రం నుంచి తీరానికి వచ్చే నీటి పరిమాణం భారీగా ఉంటుందని పేర్కొంది.

**అలస్కాను తాకిన సునామీ**

పసిఫిక్ సునామీ హెచ్చరిక కేంద్రం (పీటీడబ్ల్యూసీ) సునామీ అలలు ఇప్పటికే తీరప్రాంతాలను తాకడం ప్రారంభించాయని నిర్ధారించింది. ప్రస్తుతం హవాయిలోని ఓహు ఉత్తర తీరంలోని హలైవాలో ఓ సునామీ అల 4 అడుగుల (1.2 మీటర్లు) ఎత్తుతో ఎగసిపడిందని పేర్కొంది. అంతేకాదు అలలు దాదాపు 12 నిమిషాల వ్యవధిలో పలుమార్లు వచ్చినట్టు తెలిపింది.

**అత్యంత శక్తివంతమైన భూకంపం**

రష్యా తీరంలో సంభవించిన ఈ భూకంపం (8.8 తీవ్రత) ఆధునిక ప్రపంచ చరిత్రలో నమోదైన అత్యంత శక్తివంతమైన భూకంపాల్లో ఒకటని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే (యూఎస్‌జీఎస్) పేర్కొంది. అయితే ఈ భూకంపం తరువాత వరుసగా పలుమార్లు భూమి కంపించిందని, అందులో రిక్టర్ స్కేల్‌పై 6.9 తీవ్రతతో సంభవించిన ఓ భూకంపం కూడా ఉందని తెలిపింది. హవాయి, అలస్కాలోని అలూటియన్ దీవుల్లోని కొన్ని ప్రాంతాలు సహా, ఉత్తర కాలిఫోర్నియాలోని కొన్ని ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి. పీటీడబ్ల్యూసీ, నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్‌ఓఏఏ) రెండూ ఈ సునామీలపై నిరంతర నిఘా ఉంచాయి.

# రైతన్నా మేలుకో... అగ్రీ డాక్టర్ల సలహా తీసుకో

(మొదటి తరువాయి)

రకాలను, రసాయన ఎరువులను ప్రవేశపెట్టారు. తదనంతర కాలంలో ముమ్మరమైన వ్యవసాయ పరిశోధనలు, నూతన శాస్త్ర పరిజ్ఞానం, యంత్రీకరణల ఫలితంగా నేడు మన దేశంలో రానున్న రెండు మూడు సంవత్సరాలకు సైతం సరిపడా ఆహార ధాన్యాల నిల్వలతో దేశ ఆహార భద్రతను పటిష్టం చేసుకున్నాం. మరోవైపు గ్లోబలైజేషన్ కారణంగా అందివస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకునే దిశగా ప్రజల జీవన విధానం లో సైతం ఎనలేని మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ప్రస్తుత బిజీ జీవితం లో మారిన ఆహారపు అలవాట్ల కారణంగా ప్రజల ఆరోగ్య పరిస్థితులు సైతం వేగంగా దిగజారిపోతున్నాయి. అధిక లాభం సాధించాలనే తపనతో రసాయన ఎరువులు మరియు క్రిమిసంహారక మందుల తయారీ కంపెనీలు చేసే ప్రచార ఆర్భాటాలకి తోడు, అధిక పంట దిగుబడులు సాధించాలనే ఆశతో రైతులు సైతం విచక్షణా రహితంగా ఎరువులు, క్రిమి సంహారక మందుల వినియోగం వైపు మొగ్గు చూపడం విచారించాల్సిన అంశం. దేశం లో పంజాబ్, హర్యానా రాష్ట్రాల తరువాత సగటున ఒక హెక్టారుకు వాడే క్రిమి సంహారకాల వినియోగ మోతాదులో మూడవ అతి పెద్ద రాష్ట్రంగా తెలంగాణా ఉండటం సమస్య తీవ్రతను మన కళ్ళకు కడుతుంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారులు రసాయన రహిత ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను ముమ్మరం చేసినప్పటికీ అధికారుల తపనకు రైతుల సహకారం కూడా తోడైతేనే రాష్ట్ర వ్యవసాయ రంగం లో అద్భుతాలు సాధ్యం అవుతాయని వ్యవసాయ రంగ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రైతులు తమ పంటలకు సోకే చీడ పీడల నివారణ కొరకు రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందుల కొనుగోలు చేసే ముందు తప్పనిసరిగా స్థానిక వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవడం వల్ల రైతుకు అనవసరమైన అదనపు మందుల కొనుగోలు నుండి విముక్తి లభించడం తో పాటుగా, పంటల పెట్టుబడి తగ్గుతుంది, తక్కువ రసాయనిక అవక్షేపాలను కలిగిన, నాణ్యమైన అధిక పంట దిగుబడులు సాధ్యం ఔతాయి. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఆరోగ్య శాఖ తరహాలోనే వ్యవసాయ శాఖ అధికారుల ప్రిస్క్రిప్షన్ లేకుండా పురుగుమందుల డీలర్లు హానికరమైన రసాయన క్రిమి సంహారకాల విక్రయం చెయ్యకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటే ఇటు రైతులకు పంటలపై పెట్టుబడి భారం తగ్గడం తో పాటుగా రైతు ఉత్పత్తి చేసిన ఈ నాణ్యమైన ధాన్యాన్ని వినియోగించే వినియోగదారులకు సైతం ఆరోగ్యదాయకంగా ఉంటుందని ప్రజలు కోరుకుంటున్నారు.

## పురుగు మందుల వాడకం పై అవగాహన కల్పిస్తున్నాము.

**బి.రాజ్ కుమార్, అధ్యక్షుడు,**
**తెలంగాణ ఏఈఓ ల ఐక్య వేదిక.**



ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో రైతులకు రసాయన రహిత వ్యవసాయం పై అవగాహన కల్పిస్తున్నాం. పంటలలో చీడ పీడల సమస్య రాగానే నివారణ కొరకు ముందుగా వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి అధికారుల సూచించిన క్రిమి సంహారక మందులనే వినియోగించేలా రైతులను ప్రోత్సహిస్తున్నాం. యూరియా బస్తాల విక్రయం తప్పనిసరిగా ఈ-పాస్ మిషన్ల సహాయం తో రైతు ఆధార్ కార్డు లింక్ ద్వారా చేపట్టాలని డీలర్లకు వ్యవసాయ శాఖ నుండి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగింది. నానో యూరియా వినియోగం ద్వారా సాంప్రదాయిక యూరియా పై రైతులు ఆధారపడటాన్ని తగ్గించే దిశగా కృషిచేస్తున్నాం.

# స్థానిక విజయం లక్ష్యంగా కాంగ్రెస్ వ్యూహం

(మొదటి తరువాయి)

మొత్తంగా ఎవరి రాజకీయం వారిది. ఎవరి ఆలోచన వారిది. ఈ క్రమంలో ఆర్డినెన్స్ పాస్ కాకుంటే.. మావ్యూహం మాకుందని సిఎం రేవంత్ పదేపదే చెబుతున్నారు. అదేంటన్నది ఇప్పుడే తెలియదు. ఈ క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో నూటికి నూరు శాతం స్థానాల్లో విజయం సాధించాల్సిందేనని పట్టుదలతో కాంగ్రెస్ పనిచేస్తోంది. ఇప్పటికే క్షేత్రస్థాయిలో కార్యకర్తలకు సందేశాలు వెళ్లాయి. మరోవైపు ఏఐసిసి నాయకురాలు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ జూలై31 గురువారం నుంచి పాదయాత్రకు సిద్ధం అవుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టు-కుని ఈ నెల 31 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకూ తొలి విడత పాదయాత్ర, పల్లె నిద్ర, శ్రమదానం చేయడానికి త్రిముఖ వ్యూహాన్ని ఆమె ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ



అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్ ఎమ్మెల్యే క్వార్టర్‌లో సమావేశమయ్యారు. పది ఉమ్మడి జిల్లాల పార్టీ ఇన్‌ఛార్జిలు, పార్లమెంటు వారీగా నియమితులైన ఇన్‌ఛార్జిలుగా నియమితులైన ఉపాధ్యక్షులు, పిసిసి ప్రధాన కార్యదర్శులు, జిల్లా పార్టీ అధ్యక్షులకు దిశానిర్దేశం చేశారు. పాదయాత్రలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చూడాలని, జన సమీకరణ, భారీ ఏర్పాట్లు-, పెద్ద ఎత్తున కార్యకర్తల సమావేశం ఏర్పాటు- చేయడం గురించి మీనాక్షి సూచన చేశారు. ఈ నెల 31న రంగారెడ్డి జిల్లా పరిగిలో సాయంత్రం 5 గంటలకు పాదయాత్రకు ఆమె శ్రీకారం చుట్టనున్నారు. మీనాక్షి నటరాజన్‌తో పాటు- పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా పార్టీ నాయకులు, వివిధ కార్పోరేషన్ల చైర్మన్లు పాదయాత్రలో పాల్గొంటారు. దీనిని విజయవంతం చేయాలని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అలాగే పార్టీ నాయకులను, కార్యకర్తలు ఆమె పరుగులు పెట్టిస్తున్నారు. ఈ క్రమంలో హైకోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబర్‌లోగా స్తానిక ఎన్నికలు పూర్తి చేయాల్సి ఉంది. అయితే మీనాక్షి పాదయాత్ర కాంగ్రెస్ పార్టీకి ఏ మాత్రం ఉపయోగ పడుతుందో చూడాలి.

# ఐదు రోజుల్లో రైతులకు 500 రూపాయల బోనస్

(మొదటి తరువాయి)

నెలల కాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల ఆరువేల పైచిలుకు రేషన్ కార్డులు పంపిణీ చేశామని చెప్పారు. సున్నా వడ్డీతో 65 లక్షల మంది మహిళలకు రూ. 25 వేల కోట్ల రుణాలు ఇచ్చామని చెప్పారు. గతంలో డ్వాక్రా గ్రూప్ సభ్యురాలుగా 18 సంవత్సరాలు ఉన్న మహిళలకు మాత్రమే అవకాశం ఇచ్చేవారని.. 60 సంవత్సరాలు నిండిన వృద్ధులకు అవకాశం ఇవ్వలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం 18 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాలకే తగ్గిస్తూ 60 సంవత్సరాల వయసుని 65వ సంవత్సరాలకు పెంచుతూ జీవో ఇచ్చిందని తెలిపారు. కోటి మంది మహిళలని కోటీ-శ్వరులు చేయటమే మన ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఉచిత బస్సు ప్రయాణానికి ఐదువేల కోట్లు అదనంగా ఖర్చు చేస్తూ భారంగా భావించటం లేదని.. ప్రతి అర్హుడికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చే బాధ్యత తనదన్నారు. పేదల ఇంటి పెద్ద కొడుకులా తాను ప్రజలతో ఉంటానని హామీ ఇచ్చారు.

# నిసార్ శాటిలైట్ ప్రయోగం విజయవంతం

(మొదటి తరువాయి)

ఖర్చు చేశాయి. ఈ ప్రతిష్ఠాత్మక మిషన్ ద్వారా భూమి ఉపరితలాన్ని పరిశీలించే విధానంలో విప్లవాత్మక మార్పులు రానున్నాయి. అదేవిధంగా సహజ విపత్తులను, పర్యావరణ మార్పులను ట్రాక్ చేయడంలో నిసార్ ఉపగ్రహం కీలకపాత్ర పోషించనుంది. నిసార్ (నాసా-ఇస్రో సింథటిక్ అపెర్చర్ రాడార్) అనేది ఒక చారిత్రాత్మక ప్రాజెక్టు అని ఇస్రో, నాసా సైంటిస్టులు చెబుతున్నారు. ఇది డ్యూయల్-ఫ్రీక్వెన్సీ సింథటిక్ అపెర్చర్ రాడార్ (నాసా ఎల్-బ్యాండ్, ఇస్రో ఎస్-బ్యాండ్) ను ఉపయోగించి భూమిని మొదటిసారిగా పరిశీలించనుందని తెలిపారు. ఉపగ్రహం నిర్ణీత కక్ష్యలోకి చేరిన తర్వాత అది ప్రతి 12 రోజులకు భూమిని, మంచుతో కప్పబడిన ఉపరితలాలను 242 కిలోమీటర్ల వెడల్పుతో అధిక-రిజల్యూషన్ చిత్రాలతో స్కాన్ చేస్తుందని వెల్లడించారు. అందుకోసం మొదటిసారిగా స్వీప్‌సార్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నట్లు తెలిపారు.

# రాష్ట్రంలో మరో కొత్త డిస్కమ్ ఏర్పాటు

(మొదటి తరువాయి)

ఉచిత గృహ విద్యుత్, స్కూళ్ళు కాలేజీలకు ఉచిత విద్యుత్ పథకాలన్ని కొత్త డిస్కమ్ పరిధిలోకి తీసుకు రావాలని సూచించారు. రాష్ట్రమంతా ఒకే యూనిట్ గా కొత్త డిస్కమ్ పరిధి ఉండాలని ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. దీంతో ఇపుడున్న డిస్కమ్‌ల పనితీరు మెరుగుపడుతుందని, జాతీయ స్థాయిలో రేటింగ్ పెరుగుతుందని అన్నారు. డిస్కమ్‌ల ఆర్థిక స్థితి గతులను మెరుగుపరిచేందుకు సంస్కరణలు తప్పనిసరని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. డిస్కమ్‌ల పునరవ్యవస్తీకరణతో పాటు- విద్యుత్ సంస్థలపై ఇప్పుడు ఉన్న రుణ భారం తగ్గించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. రుణాలపై వడ్డీ భారం తగ్గించేందుకు వెంటనే ప్రణాళిక సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. 10 శాతం వరకు వడ్డీ పై తీసుకున్న రుణాలతో డిస్కమ్ లు డీలా పడ్డాయని.. ఈ రుణాలను తక్కువ వడ్డీ ఉండేలా రీ స్ట్రక్చర్ చేసుకోవా లన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు కళాశాలలతో పాటు- ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ విద్యుత్ వినియోగాన్ని అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ ఎ÷-లాంట్స్ ఏర్పాటు- చేయాలని, జిల్లాలవారీగా అనువైన భవనాలను గుర్తించే బాధ్యతను ఆయా జిల్లాల కలెక్టర్లకు అప్పగించాలని అధికారులకు సూచించారు. యుద్ధ ప్రాతిపదికన అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఇంధన శాఖపై జూబ్లీహిల్స్ నివాసంలో అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, సీఎండీ హరీష్, సీఎండీ ముషారఫ్, సీఎండీ వరుణ్ రెడ్డి, సింగరేణి సీఎండీ బలరాం, అనిల్, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశం లో పాల్గొన్నారు.

# భారత్ పై అమెరికా టారిఫ్ మోత

(మొదటి తరువాయి)

ఉన్నందున వారితో పరిమిత స్థాయిలో వ్యాపారాలు చేస్తున్నాం. ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ ఒకటి. ఏ దేశంలో లేని విధంగా వాణిజ్యపరంగా అక్కడ అడ్డంకులున్నాయి. రష్యా నుంచి భారీ స్థాయిలో సైనిక ఉత్పత్తులను భారత్ కొనుగోలు చేస్తోంది. ఉక్రెయిన్‌పై దాడులను ప్రపంచమంతా ఖండిస్తోంది. భారత్, చైనాలు మాత్రం రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటు-న్నాయి. అందుకే భారత్‌పై 25శాతం సుంకాలు అదనంగా పెనాల్టీ కూడా విధిస్తున్నాం. ఆగస్టు 1 నుంచి అమల్లోకి రానున్నాయని 'ట్రూత్ సోషల్' వేదికగా ప్రకటించారు. ఇటీవల భారత్ సహా పలు దేశాలపై ప్రతీకార సుంకాలు ప్రకటించిన ట్రంప్.. ఆగస్టు 1ని డెడ్‌లైన్‌గా విధించిన విషయం తెలిసిందే. వీటికి సంబంధించి ఏప్రిల్‌లోనే ప్రకటన చేసినప్పటికీ.. చర్చల కోసం వీటి అమలుకు గడువు ఇచ్చారు. ఇక భారత్‌పై సుంకాల విషయంలో ఇటీ-వల స్కాట్లాండ్ పర్యటన సందర్భంగా మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా భారత్ సుంకాలు విధిస్తోందని, అలా చేయడం తగదన్నారు.

# పాక్ ఉగ్రవాదాన్ని వదిలే వరకు సింధూ జలాల రద్దు అమలు చేస్తాం

(మొదటి తరువాయి)

రక్తం కలిసి ప్రవహించవని ఆయన పునరుద్ఘాటించారు. సింధూ జలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేయడం ద్వారా నెహ్రూ చేసిన తప్పిదాన్ని మోదీ ప్రభుత్వం సరిచేసిందన్నారు. నెహ్రూ నేతృత్వంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దలేమని ఆరు దశాబ్దాలుగా చెబుతూ వచ్చారు. కానీ వాటిని మార్చవచ్చని మోదీ ప్రభుత్వం చేసి చూపించింది. ఆర్టికల్ 370ను రద్దు చేశాం. ఇప్పుడు సింధూ జలాల ఒప్పందాన్ని సరిదిద్దుతున్నాం అని జైశంకర్ చెప్పారు. అప్పటి నెహ్రూ ప్రపంచం శాంతి కోసం కాకుండా బుజ్జగింపు విధానాలతో సింధూ జలాల ఒప్పందంపై సంతకాలు చేశారని తప్పుపట్టారు. మోదీ ప్రభుత్వ ప్రయత్నాల వల్లే ఉగ్రవాదం అనేది ఇవాళ్ల గ్లోబల్ ఎజెండా అయిందని జైశంకర్ చెప్పారు. ఫైనాన్సియల్ యాక్షన్ టాస్క్ ఫోర్క్ ద్వారా పాకిస్థాన్‌పై భారత్ ఒత్తిడి తీసుకురాగలిగిందని, అంతర్జాతీ భద్రతా మండలిలో భారత్‌కు సభ్యత్వం లేకున్నా లష్కరే తొయిబా ప్రాక్సీ ది రిసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్)పై ఆంక్షలు విధించేందుకు యూఎన్‌ను ఒప్పించగలిగిందని తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి తనపనేనంటూ టీఆర్ఎఫ్ ప్రకటించుకోవడాన్ని మంత్రి గుర్తు చేశారు.

## 2025 జూలై 31, గురువారం




సూర్యోదయం: ఉదయం 5:59
సూర్యాస్తమయం: సాయంత్రం 6:45
మాసం - పక్షం
శ్రావణ మాసం (అమాంత)
శుక్లపక్షం
తిథి
షష్ఠి తిథి - ఉదయం 9:42 వరకు
సప్తమి తిథి - ఆ తరువాత ప్రారంభమై, రాత్రి పాటు కొనసాగుతుంది
నక్షత్రం
స్వాతి నక్షత్రం -మధ్యాహ్నం 12:03 వరకు
విశాఖ నక్షత్రం -ఆ తరువాత ప్రారంభమవుతుంది
చంద్రోదయం: మధ్యాహ్నం 12:58
చంద్రాస్తమయం: అర్ధరాత్రి 12:01
శుభ సమయాలు
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 12:00 - 12:52
అమృతకాలం: సాయంత్రం 6:05 - 7:49
బ్రహ్మముహూర్తం: ఉదయం 4:24 - 5:11
అశుభ సమయాలు
రాహుకాలం: మధ్యాహ్నం 1:59 - 3:34
యమగండం: ఉదయం 5:59 - 7:34
దుర్ముహూర్తం: ఉదయం 10:15 - 11:06 & మధ్యాహ్నం 3:22 - 4:14
వర్జ్యం: రాత్రి 10:58 - 12:42 (అర్ధరాత్రి)

# స్నేహబంధానికి అర్థవంతమైన నివాళి



**ఇందుర్తి, జూలై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
క్లాస్‌మేట్ కూన సాయిబాబా మృతిని పురస్కరించుకొని, ఆయన కుటుంబానికి అండగా నిలిచేందుకు తోటి స్నేహితులు ముందుకొచ్చారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో 1,08,500 ఆర్థిక సహాయం అందించిన క్లాస్‌మెంట్స్, ఆయన కుమార్తె భవిష్యత్తు కోసం 26,000 ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు.బుధవారం ఈ డిపాజిట్‌ను కుటుంబానికి అందజేసి, సాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో బూడిద సదాశివ, అందె చిన్నస్వామి, పులి శ్రీనివాస్, అంబటి మోహన్, గట్టు జనార్దన్, డి.బాబు, సుతారి శ్రీనివాస్, తోట హనుమండ్లు, తాటిపెల్లి శ్రీనివాస్, పోలోజు రాజు, బొంగోని శ్రీనివాస్, శ్రీరాముల ఉత్తమా చారి, ముత్తన్నగారి రాజిరెడ్డి, జెల్ల రాజు, అనగోని శ్రీనివాస్, ఎం.డి.నసీరుద్దీన్, చింతపూల రమేష్, చింతం మహేందర్, బుర్కి పరశురాములు, అందె తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

### పాపిశెట్టి శ్వేత రాము



**ఆమనగల్లు, జూలై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పట్టణంలోని పద్మ భాస్కర్ దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటైన నూతన కంప్యూటరైజ్డ్ ఎంబ్రాయిడరీ మరియు మగ్గం వర్క్స్ షాపును బుధవారం ప్రముఖ సంఘ సేవకులు పాపిశెట్టి శ్వేత రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళలు స్వయం కృషితో తమ కాళ్లపై నిలబడే ప్రయత్నం చేయాలని, ఆర్థికంగా ఎదిగి ఇతరులకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా అడుగులు వేయాలన్నారు. మహిళలు తాము ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు దృఢ సంకల్పంతో ముందుకు సాగాలని సూచించారు.నేటి సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా వ్యాపార, ఉద్యోగ రంగాల్లో విశేష ప్రతిభను చాటుతున్నారని అభిప్రాయపడ్డారు. పలు రంగాల్లో మహిళలు చూపుతున్న నైపుణ్యం ప్రేరణగా నిలుస్తోందని చెప్పారు.కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బైకని యాదమ్మ, శ్రీశైలం యాదవ్, పూల శ్రీను, పూసలి భాస్కర్, శ్రీను నాయక్, తారా సింగ్ నాయక్, భూపతి రెడ్డి, మీసాల రమేష్, ఆనంద్, మీసాల గోపి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ విద్యార్థి పరిషత్ వల్లనే తెలంగాణ విముక్తి

### రత్నాకరం అనిరుద్ రాజు



**వనపర్తి,జూలై 30(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ విద్యార్థి పరిషత్ (టీజీవీపీ) 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని వనపర్తి జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులతో మహా ర్యాలీ నిర్వహించగా, ముఖ్య అతిథిగా టీజీవీపీ రాష్ట్ర కార్యదర్శి రత్నాకరం అనిరుద్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిరుద్ రాజు మాట్లాడుతూ, "తెలంగాణ విద్యార్థి పరిషత్ 2012 జూలై 30న ఉద్యమాల నిలయమైన ఉస్మానియా యూనివర్సిటీలో స్థాపించబడింది. అప్పటి నుంచి నేటి వరకు టీజీవీపీ విద్యార్థుల ఆశయాల కోసం నిరంతరంగా పోరాడుతోంది. ప్రత్యేక తెలంగాణ కోసం ఆంధ్ర పాలకుల మెడలు వంచించి, నీళ్ల, నిధులు, నియామకాలు వంటి హక్కుల కోసం గళం విప్పింది" అన్నారు. "టీజీవీపీ ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా పని చేయకుండా, స్వతంత్రంగా విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ జాప్యం, కాలేజీల్లో అవకతవకలు, నకిలీ విద్యాసంస్థలు, నిరుద్యోగ సమస్యలపై టీజీవీపీ ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. ఇది విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుంది" అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు వంశీ, జిల్లా కార్యదర్శి కేదార్నాథ్, జిల్లా ఉపాధ్యక్షులు సాయి, పట్టణ అధ్యక్షులు శివ, కార్యదర్శి దేవి ప్రసాద్, శ్రీమన్, విజయ్, చందు, లక్ష్మీకాంత్ అనేక మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# వాక్సినేషన్ తోనే శిశు ఆరోగ్యం

### -మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఏ. స్వప్న



**ఉప్పునుంతల, జూలై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని ఉప్పునుంతల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం చిన్నారుల టీకా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఏ. స్వప్న పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పుట్టిన వెంటనే ప్రారంభమయ్యే టీకా ప్రక్రియ ప్రతి చిన్నారికి సమయానికి తప్పనిసరిగా జరగాలని సూచించారు. పుట్టిన శిశువుల నుంచి 10 ఏళ్ల వయస్సు వరకు వివిధ వ్యాధుల నుండి రక్షణ కలిగించేందుకు ప్రభుత్వం ఉచితంగా టీకాలు అందిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ బాధ్యతగా ఈ టీకాలు సమయానికి వేయించాలన్నారు.అవసరమైన టీకాలు వేసిన పిల్లలే భవిష్యత్‌లో ఆరోగ్యంగా ఎదుగుతారని పేర్కొన్నారు. అనంతరం ఆసుపత్రికి వచ్చిన గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరంగా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కంటి వెలుగు కార్యక్రమంలో 31 మంది పేద వారికి ఉచిత శస్త్రచికిత్స



**సుల్తానాబాద్, జూలై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఆంధత్వ నిర్మూలన లక్ష్యంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గర్రెపెల్లి గ్రామంలో నిర్వహించిన ఉచిత కంటి క్యాంప్ ద్వారా ఎంపికైన 31 మంది బీదవారికి ఉచిత క్యాటరాక్ట్ శస్త్రచికిత్స నిర్వహించారు. లయన్స్ రేకుర్తి కంటి దవాఖానాలో డా. హారిక, డా. మైమునా ఆధ్వర్యంలో శస్త్రచికిత్సలు సాగాయి. రవాణా, మందులు, అద్దాలు, భోజన సదుపాయాలు ఉచితంగా కల్పించారు.లయన్ చిదుర సురేష్ నేతృత్వంలో బాధితులు తిరిగి తమ గ్రామాలకు చేరారు. సభ్యులలో లయన్స్ క్లబ్, వైశ్య సేవా కేంద్రం కరీంనగర్ వర్గాలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**భూపాలపల్లి, జూలై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గణపురం మండలం చెల్పూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు బుధవారం టెంకాయ కొట్టి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను విడతల వారీగా మంజూరు చేస్తామని తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని విమర్శించారు.అనంతరం బేడ బుడగ జంగాల ఆధ్వర్యంలో జరిగిన బోనాల వేడుకలో పాల్గొని, పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు 'మోదీ గిఫ్ట్'




**తంగళ్ళపల్లి, జూలై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తంగళ్ళపల్లి మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేతుల మీదుగా 86 సైకిళ్లు పంపిణీ చేశారు.సిఎస్ఆర్ నిధులతో అందించిన ఈ సైకిళ్లు విద్యార్థులకు 'మోదీ గిఫ్ట్'గా అందించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి తెలిపారు.కార్యక్రమంలో హెచ్ఎం రాజు నాయక్, మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్ రావు, బీజేవైఎం నేతలు, బీజేపీ నాయకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



**వంగూరు,జులై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వంగూరు మండల పరిధి లోని వై వీ ఫంక్షన్ హాల్ లో బుధవారం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సమక్షంలో రేషన్ కార్డు ల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమం లో వంగూరు మండల ఎమ్మార్వో, మురళీమోహన్, మండల వర్కింగ్ ప్రసెటెంట్ బాధమోని రమేష్ గౌడ్ జిల్లా నాయకులు ఆల్వాల్ రెడ్డి, వేమారెడ్డి మండల నాయకులు జనార్దన్ గాఫూర్ క్యామ మలయ్య, వెంకట్ గౌడ్, సైదులు, ఖాయమ్, జంగయ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కిక్ బాక్సింగ్ లో వనపర్తి బాలికలకు స్వర్ణ పతకాలు



**వనపర్తి,జులై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వనపర్తి బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు లౌక్య, ఆరాధ్యలకు రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకాలు లభించాయని కరాటే మాస్టర్ శేఖర్ తెలిపారు.ఈనెల 26, 27న లాల్ బహుదూర్ శాస్త్రి హైదరాబాద్ స్టేడియంలో జరిగిన ఖేలో ఇండియా రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లోబాలికలు పాల్గొని స్వర్ణాలు సాధించారన్నారు. విద్యార్థులను ఇంచార్జ్ హెచ్ఎం సువర్ణాదేవి, టీచర్ పద్మ విద్యార్థుల ప్రతిభను అభినందించి చదువుతో పాటు, క్రీడల్లోనూ రాణించాలని కోరారు. ఈ విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకొని ఇక ముందు ముందు విద్యార్థులు క్రీడల్లో వనపర్తికి మంచి పేరు తీసుకురావాలని వారు తెలిపారు.

# మంత్రి లక్ష్మణ్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో భారీ చేరికలు



**ఎండపెల్లి, జూలై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాజారాం పల్లె ఎస్ఆర్ గార్డెన్స్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ధర్మారం, వెల్గటూర్ మండలాల నుంచి బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన సర్పంచ్లు, నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.మంత్రివర్యులు వారికి కండువా కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు.

# అన్నం పరబ్రహ్మ స్వరూపం

**లయన్ డాక్టర్ జి మహేంద్ర కుమార్ రెడ్డి, జిల్లా గవర్నర్**



**కద్తాల్,జూలై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఇమీడియట్ పాస్ట్ డైరెక్టర్ లయన్ ఘట్టమనేని బాబురావు జన్మదినం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ కద్తాల్ బస్టాండ్ వద్ద నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా గవర్నర్ డాక్టర్ జి మహేంద్ర కుమార్ రెడ్డి మాట్లాడుతూ, అన్నం పరబ్రహ్మ స్వరూపమని అన్నదానాన్ని మించిన దానం మరొకటి లేదని, అన్నార్తులను ఆదుకోవడం వారి ఆకలి బాధను తీర్చడం గొప్ప ధర్మ కార్యక్రమం అని, ఇలాంటి పుణ్య కార్యక్రమాలు చేసే భాగ్యం లయన్స్ క్లబ్ సభ్యులకు మీల్స్ అండ్ వీల్స్ అనే ప్రోగ్రామ్ ద్వారా దొరికిందని, ఇలాంటి అన్నదాన కార్యక్రమాలకు ఇక్కడికి ఎన్నోసార్లు రావడం జరిగిందని, మారుమూల ప్రాంతాలలో సేవలందించడంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ విశేష కృషి చేయుచున్నదని, ఈ క్లబ్బు జిల్లాలోనే కాకుండా మల్టిపుల్ స్థాయిలో కూడా వివిధ క్లబ్బులకు ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. 300 మందికి అన్న దానం చేశారు. ఈ కార్యక్రమ సమన్వయకర్త మాజీ జిల్లా గవర్నర్ లయన్ జి చెన్నై కిషన్ రెడ్డి మాట్లాడుతూ లైన్స్ క్లబ్ ఆఫ్ అమనగల్ ద్వారా సమకూర్చుకున్న మీల్స్ ఆన్ వీల్స్ వాహనంపై కద్తాల్లో తరచుగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, వేసవికాలం ఏకధాటిగా 100 రోజులు అంబలి వితరణ కార్యక్రమం చేశామని, ఇలాంటి కార్యక్రమాలు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్యాబినెట్ కార్యదర్శి తాళ్ల అంజయ్య, జోన్ చైర్మన్ జూలూరు లింగయ్య, క్లబ్ కార్యదర్శి గంప శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు గుమ్మడి నరసింహ, కే. రామ్ రెడ్డి, జుట్టు లక్ష్మయ్య, జహంగీర్, చేగురి వెంకటేష్, జల్కం రమేష్, గూడే రాజు, సి. జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# షేక్పేట్ డివిజన్ లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం...

**-పాల్గొన్న మంత్రి వివేక్, అజారుద్దీన్...**




**షేక్పేట్, జూలై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సేఫ్ పేట్ షేక్పేట్ డివిజన్ బూత్ లెవెల్ కార్యకర్తల సమావేశం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి వివేక్, జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అజారుద్దీన్ పాల్గొన్నారు. డివిజన్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ బూత్ లెవెల్ లో పూర్తి స్థాయిలో కార్యకర్తల సమావేశాలు నిర్వహించి పార్టీని పటిష్టం చేసి రాబోయే ఉప ఎన్నికల్లో విజయం సాధించేలా కృషి చేయాలని కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో మోయిన్ బాయ్, నిజాం, ప్రీతి, అప్రోచ్, జ్యోతి, సోనీ, స్వరూప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్వయం ఉపాధికి మహిళల ముందడుగు




**ఎలిగేడు, జూలై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మహిళలు ఆర్థికంగా ఎదిగి కుటుంబానికి అండగా నిలవాలని ఎంపీడీవో భాస్కర్ రావు సూచించారు. ఎలిగేడు మండల కేంద్రంలో కోడూరి రమకు బ్యాంకు రుణంతో ఏర్పాటు చేసిన 'శ్రీ శ్రీనివాస స్వీట్ హౌస్'ను ఎంపీడీవో, ఎస్బీఐ మేనేజర్ అమర్ నాయక్ ప్రారంభించారు. ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా మహిళా సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం, స్వయం ఉపాధికి దోహదపడుతోందని ఎంపీడీవో తెలిపారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. బ్యాంకులు ఎల్లప్పుడూ మహిళా సంఘాలకు అండగా ఉంటాయని ఎస్బీఐ మేనేజర్ పేర్కొన్నారు. రుణాలు సకాలంలో చెల్లిస్తే మరిన్ని ప్రయోజనాలు పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం సుధాకర్, సీసీ ఆనంద్, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

# కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**మాడుగుల, జూలై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మండల కేంద్రంలోని రైతు వేదికలో గౌరవ ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి చేతుల మీదుగా 670 కొత్త రేషన్ కార్డులు, 2300 పునరుద్ధరణ కార్డులు లబ్ధిదారులకు అందించారు. అలాగే 10 మందికి కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి, రేషన్ డీలర్లు కుబ్య తండ రాజు నాయక్, లక్య నాయక్, గుడితండ మాజీ సర్పంచ్ సురేష్ నాయక్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కంఠమహేశ్వర ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే



**మాడుగుల, జూలై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అవురుపల్లి నల్లవారిపల్లి సరిహద్దులో నిర్మాణంలో ఉన్న శ్రీ కంఠమహేశ్వర స్వామి ఆలయాన్ని బుధవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరిశీలించారు. ఆలయ కమిటీ చైర్మన్ బాలమోని రవికుమార్ గౌడ్ ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఆలయానికి ప్రహరీ గోడ, సీసీ రోడ్డు, బోరు మోటార్ మంజూరు అంశంపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు గౌని నరసింహ గౌడ్, వెంకటయ్య గౌడ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కొరత లేకుండా అధికారులు పర్యవేక్షించాలి

**- మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**



**మిర్యాలగూడ, జూలై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రతి బుధవారం నిర్వహించే ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో రెండవ వారం సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, పలు శాఖల ఉన్నతాధికారులతో కలిసి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను వినిపిస్తూ ఫిర్యాదులు అందజేశారు. నడవలేని స్థితిలో ఉన్న వృద్ధ దంపతుల వద్దకు స్వయంగా వెళ్లిన ఎమ్మెల్యే, వారి సమస్యలు ఆలకించి ఫిర్యాదును స్వీకరించారు. 15 రోజుల్లో సమస్య పరిష్కారం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తక్షణమే స్పందించాలని సూచించారు. గత ప్రభుత్వాల కంటే ముందుగానే సాగునీటిని విడుదల చేసి కాంగ్రెస్ ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకుందని పేర్కొన్నారు. రైతులకు ఎరువుల కొరత తలెత్తకుండా, బ్లాక్ మార్కెట్ ధరలు పెరగకుండా, దుకాణదారులు ఇబ్బందులు కలిగించకుండా సంబంధిత శాఖలు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రత్యేక అప్లికేషన్లు సిద్ధంగా ఉండి, ప్రజలు తమ సమస్యలు తెలిపిన వెంటనే దరఖాస్తులు నింపి, 15 రోజుల్లో పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు.

# లయన్ బాపూరావు జన్మదినం సందర్భంగా అన్నప్రసాద వితరణ




**చొప్పదండి, జూలై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
లయన్ ఘట్టమనేని బాపూరావు పిఎంజెఎఫ్ జన్మదినాన్ని పురస్కరించుకొని చొప్పదండి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు తొడుపునూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సిరిపురం రాజు, రివిజన్ చైర్మన్ కొల్లూరు జితేందర్, జోన్ చైర్మన్ చింతల రవి, కొల్లూరి ఆనందం, పెద్ది లక్ష్మీకాంతం, మహేష్, మల్లేశం, రాజేష్, శంకర్, శివకుమార్, లక్ష్మయ్య, ఆంజనేయులు తదితర లైన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# జూలురి సుశీలమ్మకు బిఆర్ఎస్ నేతల నివాళి



**చింతపల్లి, జూలై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తీదేడు గ్రామానికి చెందిన జూలురి శ్రీధర్ మాతృమూర్తి జూలురి సుశీలమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి బుధవారం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన వెంట బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సోనగంటి గోవర్ధనాచారి, నాయకులు ఉలుపాల శేఖర్ రెడ్డి, ఉలుపాల పురుషోత్తం రెడ్డి, యూత్ అధ్యక్షుడు సిమర్ల కృష్ణ యాదవ్, మర్రు శ్రీనివాసరావు, జెల్లా వెంకటేశ్వర్లు, వీరమల్ల జగదీష్, ఉడుత శంకరయ్య, వలమోని వెంకటయ్య, సందె దేవయ్య, గ్రామ పెద్దలు మోర కిరణ్, దాసరి మల్లయ్య, నేలపట్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహంకాళి నగర్ లో పాదయాత్ర చేసిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్



**ఆల్విన్ కాలనీ,జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
124 ఆల్విన్ కాలనీ డివిజన్ శంషిగుడా పరిధిలోని మహంకాళి నగర్లో రెండు గల్లీలలో సీసీ రోడ్ల నిర్మాణం చాలా కాలం నుండి పెండింగులో ఉందని కాలనీ వాసులు డివిజన్ కార్పొరేటర్ శ్రీ దొడ్ల వెంకటేష్ గౌడ్ గారి దృష్టికి తీసుకురావడం జరిగింది. కార్పొరేటర్ జి.ఎచ్.ఎం.సి అధికారులతో కలిసి మహంకాళి నగర్ కాలనీ లో పర్యటించి సీసీ రోడ్డు నిర్మాణం కొరకు ఇప్పటికే నిధులు మంజూరై ఉన్నాయి కాబట్టి వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. రోడ్డును మంచిగా లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెట్టి కాలనీని పచ్చని వనంలా సుందరంగా మార్చుకోవాలని కాలనీ వాసులకు తెలిపారు. కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, గోపాల్, లింగం, సుధాకర్, సత్తయ్య, సంతోష్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ ఆసుపత్రి అభివృద్ధికి కృషి: వొడితల ప్రణవ్

**హుజురాబాద్, జూలై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ తెలిపారు. బుధవారం ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించిన ఆయన, రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలపై డాక్టర్లతో చర్చించారు. ఎస్డిఎఫ్ ఫండ్ ద్వారా హుజురాబాద్, జమ్మికుంట ఆసుపత్రులకు చెరో 15 లక్షల చొప్పున 30 లక్షలు కేటాయించామని, పనులు పూర్తయ్యాయని తెలిపారు100 డెలివరీలు ఇటీవల ఆసుపత్రిలో జరిగాయని, శానిటేషన్, మెయింటెనెన్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సహకారంతో మరిన్ని నిధులు తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ నారాయణ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణ సమితి యొక్క లక్ష్యాలు మరియు మిషన్

- **లక్ష్యం**

సుస్థిరమైన, ఆరోగ్యకరమైన జీవనవాతావరణం కోసంపర్యావరణాన్ని రక్షిస్తూ, ప్రజల ఆరోగ్యం, ఆయుష్షు పెంపుకు కృషి చేయడం.

పర్యావరణ పరిరక్షణ సమితి
చెట్టు = అమ్మ
Reg No. 643/2025
Nurture Nature, Promote Wellness

**మిషన్**

- శాస్త్రీయ పద్ధతుల్లో పర్యావరణ పరిరక్షణ
- గాలి, నీరు, నేలపై కాలుష్య నివారణ
- విద్య, సాంకేతికతతో ప్రజల్లో అవగాహన
- యువతకు పది వేల ఉద్యోగ అవకాశాలు
- అభివృద్ధి -పర్యావరణాన్ని సమతుల్యంగా ముందుకు నడిపించడం
- మాదకద్రవ్యాల రహిత భారత దేశ ఆవిష్కరణ
- భారతీయ సాంప్రదాయాల విస్తృత ప్రచారం

## భూపాలపల్లిలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్

**- ఎమ్మెల్యే గండ్ర**




**భూపాలపల్లి, జూలై 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు.భూపాలపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో రూ.42.64 కోట్లతో ఏర్పాటు చేస్తున్న ఏటీసీ ఏర్పాట్లను ఆయన బుధవారం పరిశీలించారు.ఈ సెంటర్లో రెండేళ్ల కాలపరిమితి కలిగిన ఆరు కోర్సులు అందుబాటులో ఉండగా, పదో తరగతి పాస్ అయిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అంతకుముందు క్యాంప్ కార్యాలయంలో కోర్సుల వివరాలతో కూడిన గోడపత్రికను ఆవిష్కరించారు.

## మేదర్ కుల సంఘం రాష్ట్ర కమిటీలో కరీంనగర్ ప్రతినిధులకు సత్కారం



**కరీంనగర్, జూలై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మేదర్ కుల సంఘం రాష్ట్ర కమిటీలో కరీంనగర్ జిల్లా ప్రతినిధులకు అవకాశం కల్పించిన నేపథ్యంలో జిల్లా అధ్యక్షుడు మధిర రవీందర్ ఆధ్వర్యంలో శనిగరపు సతీష్, గైని లక్ష్మీ, ఎనుగందుల రమేష్, నోముల వినోద్‌లను శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయికి వెళ్లడం శు భసూచకమని, యువత సంఘం అభివృద్ధికి కృషి చేయాలని రవీందర్ ఆకాంక్షించారు. పేద విద్యార్థులకు, కుటుంబాలకు సంఘం తరపున సహాయం అందించేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఏకుల రాజ నర్స్, మధిర గంగాధర్, ఏకుల రమేష్, మూలుమూరి రమేష్, గంగాధర తదితరులు పాల్గొన్నారు.

## కాలనీల అభివృద్ధే లక్ష్యం: శంభీపూర్ క్రిష్ణ



**కుత్బుల్లాపూర్, జూలై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ తెలిపారు.దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్‌లోని కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన కాలనీ సభ్యులు, నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజల సమస్యలను ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని శంభీపూర్ క్రిష్ణ హామీ ఇచ్చారు.ప్రతి కాలనీలో మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

**-శంభీపూర్ రాజు**



**కుత్బుల్లాపూర్, జూలై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజాప్రతినిధులు, యువనాయకులు, కాలనీ సభ్యులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వారి విన్నపాలను వినిపించగా, ఆయన సానుకూలంగా స్పందిస్తూ ప్రజల సంక్షేమమే తన ప్రాథమిక లక్ష్యమని తెలిపారు.

## గాజులరామారంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభం



**కుత్బుల్లాపూర్, జూలై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు గొంగుల అంజలి యాదవ్ గారు గాజులరామారం మహాదేవపురంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యాలయాన్ని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్యం శ్రీరంగం చేతుల మీదుగా ప్రారంభించారు.కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు ధమ్మని శ్రవణ్ కుమార్ ముదిరాజ్, దళిత సేన అధ్యక్షులు డా. అవిజె జేమ్స్, సీనియర్ నాయకులు పాల కృష్ణ, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు బేకు శ్రీనివాస్, ఎండి లాయక్, సోమన్న శ్రీధర్ రెడ్డి, ఎండీ జాకీర్, సంతోష్ ముదిరాజ్, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు పాల్గొన్నారు.

## జాడి బాల్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు



**కరీంనగర్, జూలై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బీజేపీ వెస్ట్ జోన్ కన్వీనర్ జాడి బాల్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని 63వ డివిజన్ నాయకులు, కార్యకర్తలు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడుతూ, పార్టీ అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషిని ప్రశంసించారు.

## 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల పాత పెన్షన్ పై కోర్టు ఉత్తర్వులు అమలుపరచాలి....

**హైదరాబాద్, జూలై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రభుత్వం తాను చేయాల్సిన విద్యుక్త ధర్మం పాటించనప్పుడే కోర్టులపై భారం పెరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం నూతన పెన్షన్ విధానాన్ని రూపొందించినప్పుడు ఆ ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వాలు యథాతతంగా అమలుపరిచాయి. దాని అనుబంధ జీవోలను కూడా అమలుపరచాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుంది. అది ఉద్యోగుల రాజ్యాంగబద్ధమైన హక్కు కూడా.ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధమైన హక్కును కూడా అమలుపరచడంలో వైఫల్యమే కోర్టులపై అధిక భారాన్ని కారణాలవుతున్నాయి. సుమారుగా 2000 మంది ఉద్యోగ ఉపాధ్యాయులు ఉద్యోగ నోటిఫికేషన్ ప్రకారం పాత పెన్షన్ వర్తింపుకు కోర్టుకెక్కారంటే, కేంద్ర ప్రభుత్వము ఇచ్చిన ఉత్తర్వులను అమలు పరచక పోవడం వల్లనే. సాధారణంగా కోర్టులు కూడా కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వును రాష్ట్ర ప్రభుత్వాల అమలుపరిచినప్పుడు దాని అనుబంధ ఉత్తర్వులను కూడా రాష్ట్ర ప్రభుత్వాలు అమలుపరచాల్సిందే అని చెప్పడం, ఇది సహజ న్యాయం. ఇది ఉద్యోగుల రాజ్యాంగబద్ధమైన హక్కు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సత్వరం స్పందించి కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులను అమలుపరుస్తూ, పాత పెన్షన్ అమలు కన్నా ముందు నోటిఫికేషన్ జారీ అయి తదనంతరం నియామకమైన ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలుపరుస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేష్ ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డిలో ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. కోర్టులకు పని భారం, ఉద్యోగులకు ఆర్థిక భారం తగ్గించే రీతిలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## మహేశ్వరం నియోజకవర్గం లో మంత్రి కొండ సురేఖ పర్యటన



**కందుకూర్,జులై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలంలోని గుమ్మడవెల్లి గ్రామంలో ఉన్నటువంటి రిజర్వు ఫారెస్ట్ ను సందర్శించిన అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, తో పాటు మహేశ్వరం నియోజకవర్గం ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి స్టీల్ బాల్స్ తో మొక్కలు అధిక శాతం పెరగడానికి టీవీ9 మరియు పల్లవి గ్రూప్ స్కూల్స్ ప్రజలు భాగస్వామ్యంతో గుమ్మడవెల్లి గ్రామ ఫారెస్ట్ లో మొక్కలను పెంచడం కోసం ఫారెస్ట్ డిపార్ట్మెంట్ ఎక్కువ మోతాదు లో మొక్కలను నాటడం జరిగింది మొక్కలు నాటే ప్రాంతాలు అనుకూలంగా లేని ప్రాంతాలలో డ్రోన్ మరియు ఎలిఫర్తో సీడ్స్ వేద్దగాలి మొక్కలు పెరిగేలాగా కార్యక్రమాన్ని ఒక ఉద్యమం లాగా చేస్తామని మంత్రి చెప్పడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో ఆఫీసర్లు కందుకూర్ మండల్ సీనియర్ నాయకులు ఏనుగు జంగారెడ్డి కృష్ణా నాయక్ బొక్క జంగారెడ్డి, అందుకుల సత్యనారాయణ, గ్రంథాలయ కమిటీ చైర్మన్ మాజీ పాండురంగారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు సమతా ప్రకాష్, ఎగిడి కృష్ణ రాకేష్ గౌడ్ సురేందర్ మండలాల్లోని వివిధ గ్రామాల నాయకులు పల్లవి గ్రూప్స్ విద్యార్థులు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## డబల్ బెడ్ రూమ్ బాధితులకు న్యాయం చేయాలి




**కుత్బుల్లాపూర్, జూలై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
డబల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పిస్తానని చెప్పి ప్రజల వద్ద లక్షల రూపాయలు వసూలు చేసిన శ్రీధర్ ముదిరాజ్ వ్యవహారంపై బాధితులకు న్యాయం చేయాలని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ డిమాండ్ చేశారు.జీడిమెట్ల సిఐ గడ్డం మల్లేష్‌కు బాధితులతో కలిసి సిపిఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయంలో కొంతమంది సంబంధాలను చూపి మోసం చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని సిఐ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సభ్యులు యేసు రత్నం, మండల కార్యదర్శి కే స్వామి, ఏఐటీయూసీ అధ్యక్షులు హరినాథ్ రావు, నాయకులు మధు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ నాయకుల చేతుల మీదుగా చైర్మన్‌లకు ఘన సన్మానం



**మంథని, జూలై 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మంథని, కమాన్పూర్, కాటారం మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లను మంథని యూత్ కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. పూలమాలలు, శుభాకాంక్షలతో అభినందించిన వారు పార్టీ పట్ల నిబద్ధతను చాటారు. ఈ వేడుకలో మంథని, కాటారం, జిల్లా స్థాయి నాయకత్వం పాల్గొని, నాయకత్వ లక్షణాలను ప్రోత్సహించేలా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## శ్రీ శివగంగా రాజరాజేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న కేఎల్ఆర్ & భాస్కర్ రెడ్డి



**మహేశ్వరం,జులై 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలం శ్రావణమాసం సందర్భంగా శ్రీ శివగంగా రాజరాజేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు పాల్గొన్న మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి మహేశ్వరం నియోజకవర్గం దేప భాస్కర్ రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్యుఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు...

## చట్టల పై ప్రతి ఒక్కరు అవగాహనా కల్గి ఉండాలి

-ఎలిగేడు మండలంలోని శివపల్లి లో సివిల్ రైట్స్ డే.




**ఎలిగేడు, జూలై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** చట్టాల పై ప్రతి ఒక్కరు అవగాహనా కలిగి ఉండాలని తహసీల్దార్ యాకన్నా అన్నారు. మండలం లోని శివ పల్లి గ్రామం లో బుధవారం నిర్వహించిన సివిల్ రైట్స్ డే లో ఆయన పాల్గోని మాట్లాడారు. గ్రామం లో మౌలిక వసతుల కల్పనా పై అరా తీశారు. ఈ సమావేశం లో, ఎస్ సి వెల్ఫేర్ అధికారి అంజయ్య, గిర్ద వర్ చంద్ర శేఖర్,అంగన్వాడీ టీచర్లు, పోలీసు సిబ్బంది, అంబేద్కర్ సంఘం నాయకులు గ్రామస్థులు పాల్గొన్నారు.

## గెల్వలాంబ అమ్మవారి జాతర పోస్టర్ విడుదల చేసిన ఎమ్మెల్యే



**వంగూర్, జూలై 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)** మండల కేంద్రంలోని గెల్వలాంబ అమ్మవారి ఆలయంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆగస్ట్ 13 నుంచి ప్రారంభమయ్యే అమ్మవారి జాతరకు సంబంధించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు.కార్యక్రమంలో మండల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ కపుల్స్ సేవా కార్యక్రమం



**కరీంనగర్, జూలై 30(నీలగిరి ఎక్స్ ప్రెస్):** అంతర్జాతీయ ప్రధాన కార్యదర్శి బోడ సాయి సూర్య ప్రకాష్ జన్మదినాన్ని పురస్కరించుకొని వాసవి క్లబ్ కపుల్స్ అధ్యక్షుడు జిల్లా జగదీష్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు.ఈ శ్వర్ పేపర్ మార్ట్‌లో పనిచేస్తున్న వ్యక్తికి నిత్యవసర వస్తువులు, కొత్త బట్టలు అందజేశారు.

# రాజశేఖర్ రెడ్డి పై మేము చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నాం

### మాజీ కార్పొరేటర్లు చుక్క శివకుమార్ ,యాతం పవన్ కుమార్ యాదవ్.



మాజీ కార్పొరేటర్లు.. శివ కుమార్, పవన్ కుమార్,

**జల్ పల్లి,జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మామిడిపల్లిలో ప్రభుత్వ భూమి కబ్జా అయిందని మూడు నెలల నుంచి పోరాటే ఓ పోరాట వీరుడా,ప్రెస్టేజ్ వెంచర్, స్టార్ట్ అయి మూడు ఏళ్లు అవుతుంది వైష్ణవ స్టార్ట్ అయి రెండేళ్లు అవుతుంది.వైష్ణవి వెంచర్ లో భూములు మొత్తం మీ మద్ది ఫ్యామిలీకి చెందినవి మీ బంధువులకు చెందిన భూములే కదా వాళ్ళని కూర్చోబెట్టి సమస్యను పరిష్కరించుకోవాల్సింది కదా , ఐదుసార్లు కలెక్టర్ కి ,ఐదుసార్లు ఆర్డీఓ కి, ఐదుసార్లు ఎంఆర్ఓకి ,కంప్లైంట్ ఇవ్వడంలో మర్మం ఏమిటి.మేము వకల్త పుచ్చుకున్నామని అంటున్నావు అవును కృష్ణ రెడ్డి గురించి వకల్త పుచ్చుకున్నాము, మేము గ్రామం అభివృద్ధి గురించి వకల్త పుచ్చుకున్నాము ,మేము గ్రామంలో ఉండే పాఠశాల అభివృద్ధి గురించి వకల్త పుచ్చుకున్నాము,మేము గ్రామంలో ఉండే గుడి అభివృద్ధి గురించి వకల్త పుచ్చుకున్నాము.మేము కృష్ణారెడ్డి ని అడిగి సొంత నిధులతో గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు చేసినాము కానీ నీలాగా ఎప్పుడూ కూడా, మేము కంప్లైంట్లు చేసి గ్రామ ఉనికిని, గ్రామ అభివృద్ధిని కుంటుపడేటట్టు చేయలేదు.అవును వకల్త పుచ్చుకుంటే తప్పేముంది, ఆయన గ్రామంలో జరిగే అభివృద్ధి పనుల్లో అన్నింటిలో తన వంతు సహాయ సహకారాలు అందజేస్తారు.దేవుళ్ళ మీద ఒట్టు పెట్టడం, ఆ ఒట్టు తీసి గట్టు మీద పెట్టడం. నీకు అలవాటు మాకు అలవాటు లేదు.అందితే జుట్టు లేకపోతే కాళ్లు పట్టుకోవడం నీకు అలవాటు.ఒక ఎమ్మార్వోని, మహిళా అని చూడకుండా కంప్లైంట్ ఇచ్చిన గాని, నిద్రపోతుందని మాట్లాడుతావా? నీకు మహిళల పైన ఉన్న గౌరవం ఏంటో తెలియజేస్తుంది. నీ అసహనానికి నీ పిచ్చికి ఇది ఒక పరాకాష్ట.మీర్పేటలో ఉన్న కార్పొరేటర్ మామిడిపల్లిలో జరిగే కబ్జాల గురించి మాత్రం మాట్లాడొచ్చు, కానీ మామిడిపల్లి అభివృద్ధి గురించి అడిగితే మాత్రం అధికారం గుర్తుకొస్తుంది.మరి అభివృద్ధి చేయడం చేతగానప్పుడు ఎక్కడో ఉన్న మీర్పేట్ కార్పొరేటర్ వచ్చి ఇక్కడ మాట్లాడమేంటి మామిడిపల్లి గురించి ఏమి హక్కు ఉంది.మీర్పేట్ లో నీ డివిజన్లో వచ్చి మేము కంప్లైంట్ ఇస్తామా.నువ్వు మీర్పేట్ కార్పొరేషన్ నుంచి, బడంగ్పేట్ కార్పొరేషన్ కి వచ్చి కంప్లైంట్ ఇచ్చావు కదా,నీకు కబ్జాల పైన అంత బాధగా ఉంటే నిజంగా దమ్ము ధైర్యం ఉంటే ,పక్క మున్సిపాలిటీ ,జల్పెల్లి గ్రామంలో, జెల్పెల్లి చెరువు అంతా కబ్జా అయిపోయింది .నువ్వు చిన్న ఉన్నప్పుడు తిరిగిన చెరువు ,నువ్వు ఈత కొట్టిన చెరువు, పక్క గ్రామమే, నువ్వు రాజకీయం చేసిన ఊరు, మరి అక్కడ కూడా నువ్వు ,దయచేసి కంప్లైంట్ ఇవ్వు నీకు దమ్ము ధైర్యం ఉంటే.రాజశేఖర్ రెడ్డి మా యొక్క విన్నపం ఏంటంటే మామిడిపల్లి నిన్నటి వరకు ఒక శివారు గ్రామం ,ఈరోజు అభివృద్ధిలో హైదరాబాద్ తో పోటీ పడుతూ ముందుకు సాగుతున్నటువంటి ఒక గ్రామం, నీలాంటి చర్యల వల్ల ఇక్కడ ప్లాట్లు కొనేవారు ,అమ్మేవారు రియల్ ఎస్టేట్ పైన ఆధారపడి చిరు వ్యాపారం చేసే చిన్న కమిషన్ ఏజెంట్లు, రోడ్లమీద పడ్డుతారు. నీలాంటి పేపర్ స్టేట్మెంట్లు ఇవ్వడం వల్ల ,వీళ్ళ బతుకులు రోడ్ల పైన పడతాయి .వైష్ణవి వెంచర్లో మొత్తం మీకు సంబంధించిన బంధువుల భూములే కదా ఉన్నాయి. ఇంకొక విషయం నాకు కృష్ణ రెడ్డి ఎవరో తెలియదు, అసలు నాకు సంబంధం లేదు కృష్ణరెడ్డి తోటి, అంటున్నావు, కదా ,మరి నాకు కృష్ణ రెడ్డి ,తోటి ప్రాణభయం ఉంది వైష్ణవి యజమాన్యంతోటి ప్రాణభయం ఉందని కంప్లైంట్ ఎందుకు ఇచ్చారండి.మేము నీ పార్టీ గురించి గానీ నీ ధర్మం గురించి ఎప్పుడు మాట్లాడలేదు. నీకు మా ఎమ్మెల్యే ని విమర్శించే అర్హత లేదు.అయినా నిన్ను నిజాయితీ నిరూపించుకోమని ,నువ్వు మామిడిపల్లి విలేజ్ లో ఉన్న వెంచర్ల లో కాకుండా బాలాపూర్ మండలం లో ఎక్కడ ఉన్న వెంచర్లల్లో కూడా ముడుపులు ముట్టుకోలేదని ఒట్టు పెట్టమని, నిన్ను అనుమాన్ టెంపుల్ కి వెళ్ళమని, నువ్వు సత్యహరిశ్చంద్రుడివని నిరూపించుకోమని ఎవరు అడగలేదు.వారం రోజుల తర్వాత సెటిల్మెంట్ చేసుకొని వచ్చి చెవి కోసిన మేకల అరుస్తున్నావు,నీ గతమేందో, నువ్వేంటో గ్రామస్తులందరికీ తెలుసు, ఇకనైనా నోరు పారేసుకోకుండా,గ్రామ అభివృద్ధికి.సహకరించు. లేకపోతే నువ్వు ప్రస్తుతం ప్రెస్ కాలనీలో ఉంటున్నటువంటి ఇల్లు ఒక పేద బ్రాహ్మణులది గుంజుకొని కబ్జా పెట్టి ఇల్లు కట్టలేదా, అదేవిధంగా మామిడిపల్లి 110 సర్వే నెంబరు జల్పెల్లి గ్రామస్తులు వెంచర్ చేస్తుంటే వాళ్ళని అడ్డుకొని వాళ్ళ దగ్గర ముడుపులు తీసుకోలేదా, ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో , ప్రత్యర్థి పార్టీకి కీలక సమాచారం చేరవేసి, నేతల నుంచి రూ. 25 లక్షలు తీసుకున్నట్టు స్థానిక నాయకులు చెబుతున్నారు. ఈ వ్యవహారంలో సీనియర్ నాయకుడితో గొడవ చేయలేదా,దేవతలగుట్ట వద్ద భూ వివాదంలో ప్రముఖ రియల్టర్ పై కోట్లు డిమాండ్ చేసి, ఉచితంగా గ్రానైట్ రాళ్లను తీసుకుని, 50 లక్షలకు సెటిల్మెంట్ చేసుకోలేద... మామిడిపల్లి రంగనాయకుల కాలనీ దేవేందర్ నగర్ కాలనీలో నిరుపేదమని చెప్పి నిరుపేదల పైన పట్టాలు తీసుకొని, అవి తర్వాత అమ్ముకోలేదా ఇలా ఇంకా ఎన్నో అవినీతి చిట్టాలని బయట పెట్టాల్సినటువంటి అవసరం వస్తదని చెప్పి తెలియజేసుకుంటున్నాం.అయినా నువ్వు బుద్ధిమంతుడు నీతిమంతుడివి అయితే,మమ్మల్ని కూడా పిలిపించి, ఊరందరిని పిలిపించి , డబ్బు చాటి ఇప్పిచ్చి ,అందరికీ చెప్పి, అందరి సమక్షంలో ఒట్టు తినాలి ,ఏదో మంగళవారం నాడు హనుమాన్ టెంపుల్ కి వచ్చినట్టు వచ్చి, నాశనం అయిపోని అని , ఆడపిల్లలేక అర్ధనాదాలు చేస్తే దానికి అర్థం ఏమి ఉంటది .ఒక రాజకీయ నాయకుడు అంటే విమర్శకు ప్రతి విమర్శ చేయాలి అయినా నువ్వు పెడబొబ్బలు పెట్టుకొని శోకం పెట్టుకుని ఏడుస్తావేంటి ఇదెక్కడి న్యాయం.ఇది రాజకీయ నాయకుడి లక్షణం కాదు, నీకు రాజకీయ లక్షణాలు ఏ కోశానా కూడా లేవు అన్నారు.

## రామగుండం ఎత్తిపోతల పథకం ప్రారంభానికి ఏర్పాట్లు



**అంతర్గాం, జూలై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ముర్మూరు వద్ద నిర్మించిన రామగుండం ఎత్తిపోతల పథకం ప్రారంభానికి ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు.గోలివాడ గ్రామంలో క్రీడా ప్రాంగణం, అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాట్లను అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి పరిశీలించారు.ఈ పథకం ద్వారా 17ఎల్, 27ఎల్ కాల్వల క్రింద పాలకుర్తి, అంతర్గాం మండలాల్లోని 13,386 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది.ఆగస్టు 3న నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటన సందర్భంగా పథకం ప్రారంభం, రేషన్ కార్డుల పంపిణీ, మహిళా శక్తి సంబరాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

## చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్




**గోదావరిఖని, జూలై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** గౌతమి నగర్‌లోని కే.సి. పుల్లయ్య విద్యాలయ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు.క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగవుతుందని, పోటీతత్వం పెరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం మౌలిక వసతుల కల్పనకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## జూలపల్లిలో ట్రాక్టర్ బోల్తా,డ్రైవర్ మృతి

**తలకొండపల్లి, జూలై 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)** మండలంలోని జూలపల్లి గ్రామ శివారులో బుధవారం సాయంత్రం ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ బైరపాక ఆంజనేయులు (32) అక్కడికక్కడే మృతి చెందారు. కేశంపేట మండలానికి చెందిన శ్రీశైలం ట్రాక్టర్ను వ్యవసాయ పనుల అనంతరం తిరిగి వస్తుండగా, లింగందాన రహదారిలో అదుపుతప్పి బోల్తా పడింది.ట్రాక్టర్‌పై ఉన్న రాజు, గణేష్ స్వల్ప గాయాలతో బయటపడగా, ఆంజనేయులు తలపగిలి ప్రాణాలు కోల్పోయారు.మృతుడికి భార్య సైదమ్మ, కుమారుడు ఉన్నారు. గ్రామస్థులు తీవ్ర విషాదం వ్యక్తం చేశారు. తలకొండపల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు.



## బీజేపీ బలోపేతానికి యువత ముందుకు రావాలి

### -గోదావరి అంజిరెడ్డి



**బొల్లారం, జూలై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి పలు కాలనీల యువతను పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు.బొల్లారం మున్సిపల్ పరిధిలో జరిగిన కార్యక్రమంలో యువత బీజేపీ నాయకుడు కెజెఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి చేపట్టిన సామాజిక కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరారు.ఈ సందర్భంగా గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ, “పార్టీ పటిష్టానికి యువత కృషి కీలకం. రాబోయే ఎన్నికల్లో గెలుపు కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలి” అని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో టీ. రవీందర్ రెడ్డి, టీ. మేఘన రెడ్డి, అఖిల్, వి. శ్రీకాంత్ చారి, అరుణ్, మోహిత్ రాజ్ పుత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నులి పురుగుల నివారణపై అవగాహన కల్పించాలి

### -ఎమ్మెల్సీ అంజిరెడ్డి



**పటాన్చెరు, జూలై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రామచంద్రపురం సాయి నగర్ కాలనీలో నిర్వహించిన జాతీయ ఫైలేరియా, నులి పురుగుల నిర్మూలన అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్సీ డా. చిన్న మైల్ అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, “1-19 ఏండ్ల పిల్లలకు కేంద్రం ప్రతి యేటా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తోంది. ఆరోగ్య, అంగన్వాడీ, పాఠశాల సిబ్బంది పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలి. ఆరోగ్యకర సమాజం కోసం అందరూ కృషి చేయాలి” అని సూచించారు.

## కరీంనగర్‌లో పీసీ & పీఎన్డీటీ కమిటీ సమావేశం



**కరీంనగర్, జూలై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. వెంకటరమణ అధ్యక్షతన పీసీ & పీఎన్డీటీ కమిటీ సమావేశం మంగళవారం జరిగింది.లింగ ఎంపిక నిషేధ చట్టం, ఐవీఎఫ్ కేంద్రాల పనితీరు, ఎంపీటీ, ఆర్ట్, సరోగసీ చట్టాల అమలుపై చర్చించారు. నిబంధనలు ఉల్లంఘించిన ఐవీఎఫ్ కేంద్రాలపై కఠిన చర్యలు, జరిమానాలు విధించనున్నట్లు తెలిపారు.జిల్లాలో 15 ఐవీఎఫ్ కేంద్రాలు రిజిస్టర్ కాగా, 43 కేంద్రాలకు నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. రేపటి నుండి జిల్లా స్థాయి స్పెషల్ డ్రైవ్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.అంతకుముందు పీపీ యూనిట్, డీఈఐసీ కేంద్రాన్ని పిఓ ఎంహెచ్ఎన్ డా. సన జవేరియాతో కలిసి సందర్శించారు.కార్యక్రమంలో కమిటీ సభ్యులు, వైద్యులు, స్టాఫ్ పాల్గొన్నారు.

## వర్షాకాల వ్యాధులపై అవగాహన



**వెల్దండ, జూలై 30(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వెల్దండ మండలం బైరాపూర్ గ్రామంలో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. పల్లె దవాఖాన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి పవన్ నాయక్ ప్రజలకు దగ్గు, జలుబు, జ్వరం, విరేచనాలు వంటి వ్యాధులపై జాగ్రత్తలు సూచించారు. వైరల్ ఫీవర్ గాలి, నీటి ద్వారా వ్యాపిస్తుందని తెలిపారు.ఈ సందర్భంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. లింగయ్య, పెంటమ్మ, అంజయ్య తదితరులు పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం పద్మ, ఆశావర్కర్ చంద్రకళ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన సేవలు అందించాలి

### -కలెక్టర్ పమేలా



**కొత్తపల్లి, జూలై 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు.బుధవారం కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆమె, ఓపీ రిజిస్టర్, ఎన్సీడీ రిపోర్టు, ఆరోగ్య మేళా పరీక్షలు, ఐపీ వార్డు, ఆపరేషన్ థియేటర్, లేబర్ రూమ్ తదితర సౌకర్యాలను పరిశీలించారు.గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, పరీక్షలు, మందులు సకాలంలో అందించాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకట రమణ, అధికారులు సనా, నాజియా పాల్గొన్నారు.

## విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి


### -కలెక్టర్ పమేలా



**చొప్పదండి, జూలై 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రుక్మాపూర్ జడ్పీ పాఠశాలను సందర్శించిన కలెక్టర్ పమేలా సత్పతి విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని సూచించారు.పరిసరాల పరిశుభ్రత, గదుల వినియోగం, నీటి కనెక్షన్, రీడింగ్ కార్నర్ ఏర్పాటు వంటి అంశాలపై ఆదేశాలు జారీ చేశారు.వృథాగా ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలను డీఈఓ కార్యాలయానికి పంపించాలని, సీజనల్ వ్యాధుల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి, భాషా నైపుణ్యాల అభివృద్ధిపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

## రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ

### - కలెక్టర్ పమేలా, ఎమ్మెల్యే సత్యం



**చొప్పదండి, జూలై 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అర్హులందరికీ రేషన్ కార్డులు అందించేందుకు ప్రభుత్వం నిరంతర ప్రక్రియగా పంపిణీ కొనసాగిస్తుందని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు.బుధవారం ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో 78,000 కొత్త రేషన్ కార్డులు,చొప్పదండి నియోజకవర్గానికి 4,000 కార్డులు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, ఉద్యోగ భర్తీ, రుణమాఫీ, బీమా పథకాలు అమలు చేస్తోందన్నారు.కార్యక్రమంలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. తహసీల్దార్ నవీన్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## కష్టపడితే విజయమే

### ప్రభుత్వ విద్యను ఉత్తేజించే నూతన శకం!



**రామగుండం, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎన్టీపీసీ జెడ్పీ పాఠశాలలో 10వ తరగతి క్యూఆర్ కోడ్ పుస్తకాల ప్రారంభోత్సవ కార్యక్రమం అత్యంత హర్షాతిరేకంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి రామగుండం శాసనసభ్యులు శ్రీ ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు నూతనోద్దీపన కలిగించారు.“ఇష్టంతో చదువుకుంటేనే విజయం సాధించవచ్చు. క్రీడల్లో కష్టపడితే గొప్ప స్థాయికి ఎదగవచ్చు. ప్రైవేట్ పాఠశాలల కన్నా ప్రభుత్వ స్కూళ్ళే మాకు ముద్దు” అని ఆయన పేర్కొన్నారు.తెలంగాణ ప్రభుత్వ పర్యవేక్షణలో “ స్కాన్ & లెర్న్ %-% ఏ యూనిక్ లెర్నింగ్ ఎక్స్పీరియన్స్” నినాదంతో అందుబాటులోకి వచ్చిన క్యూఆర్ కోడ్ పుస్తకాలు విద్యార్థుల చదువుకు దోహదపడనున్నాయి. ప్రతి పాఠ్యాంశానికి అనుగుణంగా క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే సంబంధిత ఆడియో, వీడియో, శిక్షణా పాఠాలు లభ్యమవుతాయి.ఈ కార్యక్రమానికి సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ వారి సీఎస్ఆర్ నిధుల ద్వారా మద్దతు అందించబడింది. విద్యావైద్యం పరంగా ఇది ఓ నూతన శకం అని విద్యావేత్తలు పేర్కొన్నారు.కార్యక్రమంలో సింగరేణి జీఎం లలిత్ కుమార్, ఏసిపి రమేష్ కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, ఇతర ప్రముఖులు పాల్గొని విద్యార్థులకు ప్రోత్సాహం కలిగించారు.

## కల్యాణమస్తు షాపింగ్ మాల్ ప్రారంభించిన ఎమ్మెల్యే



**పెద్దపల్లి, జూలై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పట్టణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కల్యాణమస్తు షాపింగ్ మాల్ను ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు,సినిమా నటి అనన్యతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు.


## ప్రజలతో మమేకమైన వొడితల ప్రణవ్





**హుజురాబాద్, జూలై 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మధువని గార్డెన్స్‌లో జరిగిన ప్రతాప రాజు కుమార్తె వివాహ శుభకార్యానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ గారు ప్రజలతో మమేకమయ్యారు.జమ్మికుంట 5వ వార్డు మాజీ కౌన్సిలర్ పిట్టల శ్వేత -రమేష్ దంపతులకు ఆడబిడ్డ జననం సందర్భంగా ఆసుపత్రిలో శుభాకాంక్షలు తెలిపారు.అలాగే 11వ వార్డు మాజీ కౌన్సిలర్ బిట్ల కళావతి భర్త మోహన్ అనారోగ్యంతో చికిత్స పొందుతుండగా పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

## రంగసముద్రం జలాశయాన్ని పరిశీలించిన మంత్రి జూపల్లి



**వనపర్తి, జూలై 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
శ్రీరంగాపూర్ మండలంలోని రంగసముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఇవాళ సందర్శించారు. సాగునీటి పంపిణీలో జాప్యం జరుగుతోందని రైతులు మంత్రి దృష్టికి తీసుకురావడంతో, ఆయన పరిశీలన నిర్వహించారు.రిజర్వాయర్‌లో తగినన్ని నీటి నిల్వలు ఉన్నప్పటికీ, వీపనగండ్ల, చిన్నంబావి మండలాలకు సాగునీరు విడుదల చేయకపోవడంపై మంత్రి అధికారులను తీవ్రంగా ప్రశ్నించారు. భీమా కెనాల్ ద్వారా నీటిని విడుదల చేయకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. “నీటి లభ్యత ఉన్న పరిస్థితుల్లో సకాలంలో సాగునీరు విడుదల చేయకుండా ఆలస్యం చేయడం అవాంఛనీయం” అని పేర్కొన్నారు.అలాంటి పరిస్థితులు పునరావృతమైతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడం తప్పదని హెచ్చరించారు. రోజువారీగా విడుదల చేస్తున్న నీటి పరిమాణాన్ని స్పష్టంగా లాగ్‌బుక్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా మంత్రి జూపల్లి వెంట ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి, ఇఇ కేశవరావు, డీఈలు కిరణ్ కుమార్, రాజ్ కుమార్, ఏఈఈ వినయ్ కుమార్, ఏఈ అక్షయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ శివశక్తి... ఇద్దరు ఉగ్రవాదులు హతం



**శ్రీనగర్ జూలై 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మన దేశంలోకి చొరబడేందుకు ప్రయత్నించిన ఇద్దరు ఉగ్రవాదులను ఆపరేషన్ శివశక్తి చేపట్టి మట్టుబెట్టినట్టు సైన్యాధికారులు బుధవారం తెలిపారు. జమ్ము కశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో నియంత్రణ రేఖ వద్ద ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. మంగళవారం రాత్రి ఇద్దరు లేదా ముగ్గురు ఉగ్రవాదులు కల్సియాన్-గుల్పూర్ ప్రాంతంలో సరిహద్దు దాటి రావడానికి ప్రయత్నించినప్పుడు ఈ ఎన్‌కౌంటర్ ప్రారంభమైంది.నిఘా వర్గాల సమాచారం మేరకు ఈ ఆపరేషన్ చేపట్టామని అధికారులు తెలిపారు. 'తక్షణ చర్య, కచ్చితమైన తుపాకుల ప్రయోగం దుర్మార్గపు ప్రణాళికలను తిప్పి కొట్టాయి' అని సైన్యం 16వ పటాలం ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

# రష్యా సునామీతో ప్రపంచ దేశాల అప్రమత్తం

**జపాన్ తీరంతో పాటు, అమెరికాలోనూ ప్రభావం**
**ప్రజలను అప్రమత్తం చేసిన ఆయాన దేశాలు**
**సముద్ర తీరంలో ఎగిసి పడుతున్న రాకాసి అలలు**
**చైనాలోనూ వాతావరణ బీభత్సం..భారీగా వర్షాలు**

**మాస్కో జూలై 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రష్యాలోని కామ్చాట్కా ద్వీపకల్పంలో బుధవారం 8.8 తీవ్రతతో భారీ భూకంపం సంభవించడంతో దీని ప్రభావంతో రష్యా, జపాన్ తీర ప్రాంతాలను సునామీ తాకింది. పలుచోట్ల రాకాసి అలలు ఎగసిపడుతున్నాయి. వీటితో పాటు-ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు, దీవులకు సునామీ ముప్పు పొంచి ఉంది. అమెరికాలోని ద్వీప రాష్ట్రం హవాయి మొత్తానికి సునామీ హెచ్చరిక జారీ అయింది. అలలు ఆరు అడుగుల ఎత్తు వరకు ఎగసిపడుతున్నాయి. రాష్ట్రం మొత్తం సునామీ సైరన్లు వినిపించాయి. దాంతో పర్యాటకులు, స్థానికులు తమ స్వస్థలాలను వీడి ఎత్తైన ప్రాంతాలకు తరలివెళ్తున్నారు.



ఒక్కసారిగా రాష్ట్ర ప్రజలంతా తరలుతుండటంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రోడ్లన్నీ కారులతో బారులు తీరాయి. ఆ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఇక అలస్కాలోని కొన్ని ప్రాంతాలను అమెరికా వాతావరణ విభాగం అప్రమత్తం చేసింది. అమెరికా వాతావరణ విభాగం కీలక హెచ్చరిక జారీ చేసింది. సునామీ తీవ్రతను తేలిగ్గా తీసుకోవద్దని, ఫొటోల కోసం తీరానికి వెళ్లొద్దని చెప్పింది. ఒక్క అలతో సునామీ రాదని, అలలు పెద్దసంఖ్యలో వస్తాయని, సముద్రం నుంచి తీరానికి వచ్చే నీటి పరిమాణం భారీగా ఉంటుందని వెల్లడించింది. ఇదిలాఉంటే.. జపాన్ తీర ప్రాంతంలోని 9 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తోంది. చైనాకు ఈ ప్రకృతి విపత్తు ముప్పు పొంచి ఉంది. సునామీనే కాకుండా సైక్లోన్ ప్రమాదమూ ఉంది. దాంతో షాంఘైలోని 28 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. విమానాలు, బోట్ సర్వీసులను నిలిపివేశారు. ప్రస్తుతం తూర్పు చైనాలో ఈదురుగాలులు, భారీ వర్షాలు కురుస్తున్నాయి. రష్యాలో తూర్పు ప్రాంతంలో బుధవారం తెల్లవారుజామున వచ్చిన భారీ భూకంపం కారణంగా దాంతోపాటు- చుట్టు-పక్కల దేశాలపై సునామీ అలలు విరుచుకు పడ్డాయి. అలలు తాకిన దీవుల్లో రష్యా అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. ఈ సునామీ వల్ల ఆయా ప్రాంతాల్లో వరదలు సంభవించాయి. పలు నిర్మాణాలు దెబ్బతిన్నాయి.

# బెంగళూరులో అల్‌ఖైదా టెర్రర్ మాడ్యూల్.. మాస్టర్‌మైండ్ పర్వీన్ అరెస్ట్



**బెంగళూరు జూలై 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
భారతదేశంలో అల్‌ఖైదా టెర్రర్ మాడ్యూల్‌ను నడుపుతున్న ప్రధాన సూత్రధారిని భద్రతా బలగాలు చాకచక్యంగా పట్టుకున్నాయి. అల్‌ఖైదా కార్యకలాపాలకు మాస్టర్‌మైండ్‌గా భావిస్తున్న 30 ఏండ్ల షామా పర్వీన్‌ను గుజరాత్ ఏటీఎస్ బృందం బెంగళూరులో అరెస్టు చేసింది. దేశానికి వ్యతిరేకంగా కుట్రలకు పాల్పడ్డ సంగతిని ఆమె పోలీసుల విచారణలో అంగీకరించినట్టు తెలిసింది. సోషల్ మీడియాలో జిహాద్ కంటెంట్‌ను వ్యాప్తి చేస్తూ ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నించినట్టు నేరాన్ని ఆమె అంగీకరించారు. ఆమెకు వ్యతిరేకంగా డిజిటల్ సాక్ష్యాలు లభించాయని.. గతవారం భద్రతా బలగాలకు చిక్కిన నలుగురు అల్‌ఖైదా సభ్యులు ఆమె గురించి చెప్పారని ఏటీఎస్ డీఐజీ సునీల్ చెప్పారు

# నోట్ల కట్టల కేసులో జస్టిస్ వర్మపై సుప్రీం ఆగ్రహం


**తప్పు లేకుంటే ముందే ఎందుకు స్పందించలేదని ప్రశ్న**

**న్యూఢిల్లీ, జూలై 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)** నోట్ల కట్టల వ్యవహారం కేసు జస్టిస్ యశ్వంత్ వర్మను వెంటాడుతోంది. ఇక త్రిసభ్య విచారణ కమిటీ- ఇచ్చిన నివేదికను సవాల్ చేస్తూ యశ్వంత్ వర్మ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. దీనిపై బుధవారం సుప్రీంకోర్టు ధర్మాసనం విచారించింది. నోట్ల కట్టల ఘటనపై సుప్రీంకోర్టు ముగ్గురు న్యాయమూర్తులతో విచారణ కమిటీని నియమించింది. కమిటీ విచారణ జరిపి నివేదిక సమర్పించింది. నోట్ల కట్టలు వర్మవిగా కమిటీ- తేల్చింది. అయితే కమిటీ ఇచ్చిన నివేదికను సవాల్ చేస్తూ వర్మ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు.వర్మ తరఫున ప్రముఖ న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు. న్యాయమూర్తిని తొలగించాలని అంతర్గత విచారణ ప్యానెల్ చేసిన సిఫార్సు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. మీ ప్రవర్తన నమ్మశక్యంగా లేదని..



రాజ్యంగ విరుద్ధమని భావిస్తే విచారణకు ఎందుకు హాజరయ్యారని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై ముందే సవాల్ చేయాల్సింది కదా? అని అసహనం వ్యక్తం చేసింది. న్యాయపరమైన తప్పులు జరిగినప్పుడు చర్య తీసుకునే హక్కు చీఫ్ జస్టిస్‌కు ఉంటుందని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. మార్చి 14న జస్టిస్ యశ్వంత వర్మ నివాసంలోని స్టోర్ రూమ్‌లో అగ్నిప్రమాదం జరిగింది. రాత్రి 11:43 గంటలకు అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని చెల్లాచెదురుగా పడి ఉన్న నగదును గుర్తించారు. అనంతరం ఈ సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. నగదు వీడియోలను రికార్డ్ చేసి ఢిల్లీ పోలీసులు.. సీనియర్ అధికారులకు పంచారు. అనంతరం భారత ప్రధాన న్యాయమూర్తికి సమాచారం అందించారు. దీంతో అప్పటి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ఖన్నా విచారణకు ఆదేశించారు. దాదాపు రూ.15 కోట్ల వరకు నగదు ఉంటు-ందని సమాచారం. భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం.. జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసింది. కానీ ఆయనకు ఎలాంటి న్యాయపరమైన బాధ్యతలు అప్పగించొద్దని సూచించింది.

# ఆ గ్రహశకలం చంద్రుడిని ఢీకొడితే భూమిపైనా తీవ్ర ప్రభావం..!



**న్యూఢిల్లీ, జూలై 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఓ గ్రహశకలం అంతరిక్షంలో చంద్రుడివైపు దూసుకెళుతోందని, అది 2032లో చంద్రుడిని ఢీకొట్టే ప్రమాదం ఉందని నాసా శాస్త్రవేత్తలు తెలిపారు. దాదాపు 15 అంతస్తుల భవనం పరిమాణంలో ఉన్న ఆ గ్రహశకలం ఢీకొడితే చంద్రుడి ఉపరితలంపై ఏకంగా 800 అడుగులమేర భారీ గుంత ఏర్పడుతుందని వారు వెల్లడించారు. దాని ప్రభావం భూమిపైనా పడుతుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.నాసా జేమ్స్ వెబ్ స్పేస్ టెలీస్కోప్ గుర్తించిన ఆ గ్రహశకలాన్ని '2024yr4' గా వ్యవహరిస్తున్నారు. అయితే ఆ గ్రహశకలం చంద్రుడిని ఢీకొట్టే అవకాశం స్వల్పంగా మాత్రమే ఉందని సైంటిస్టులు చెబుతున్నారు. '2024yr4' గ్రహశకలం చంద్రుడిని ఢీకొడితే భారీ విస్ఫోటనం ఏర్పడుతుందని, గ్రహశకలం ముక్కలైపోతుందని నాసా శాస్త్రవేత్తలు చెప్పారు. ఆ గ్రహశకలం ముక్కలు భూమివైపు వస్తాయని, వాటివల్ల భూకక్ష్యలో తిరగుతున్న ఉపగ్రహాలకు ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తంచేశారు.చంద్రుడిని ఢీకొట్టి ముక్కలైన గ్రహశకలంలో ఒక్కొక్క ముక్క ఒక్కో మీటర్ పరిమాణంలో ఉండే అవకాశం ఉందని, ఆ భారీ గ్రహశకలం ముక్కలు ఢీకొడితే భూకక్ష్యలోని ఉపగ్రహాలు దెబ్బతింటాయని సైంటిస్టులు చెబుతున్నారు. ప్రస్తుతం భూమి చుట్టూ సుమారు 10 వేలకు పైగా యాక్టివ్ ఉపగ్రహాలు తిరుగుతున్నాయని, మరో 25 వేల వరకు అంతరిక్ష వ్యర్థాలు ఉన్నాయని నాసా శాస్త్రవేత్తలు తెలిపారు.


# ప్రపంచంలో అత్యధిక వలసదారులు భారత్ నుంచే

## ఐక్యరాజ్యసమితి నివేదిక

**న్యూఢిల్లీ, జూలై 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఏమిటీ.. ఏ దేశంలో చూసినా భారతీయులే కనబడుతున్నారు.. విదేశాల్లో మనవారు అంతమంది ఉన్నారా? అన్న అనుమానం మీకు ఎప్పుడైనా కలిగిందా? మీ అనుమానం నిజమే.. ఐక్యరాజ్యసమితి వెల్లడించిన గణాంకాలు కూడా ఆ విషయాన్నే నిర్ధారిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వలసదారుల్లో అత్యధికం భారతీయులే అని ఐరాస వెల్లడించింది. 2024 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 1.85 కోట్ల మంది ప్రవాస భారతీయులు ఉన్నట్టు, ఇది ప్రపంచ వలసదారుల్లో 6 శాతం అని తెలిపింది.ఒకప్పుడు సౌదీ అరేబియా, పాకిస్థాన్ దేశాలకే పరిమితమైన భారతీయ వలస సముదాయం ఇప్పుడు పశ్చిమ దేశాలకు బదిలీ అయ్యింది. పశ్చిమాసియాలోని ఇండియన్ దయాస్పొరాను తీసుకుంటే యూఏఈలోని మొత్తం జనాభాలో 40 శాతం (ఇంచుమించు మూడో వంతు) భారతీయ వలసదారులే ఉన్నారు. ఇక అమెరికాలో ఇండో అమెరికన్లు రెండో అతిపెద్ద ఆసియన్ గ్రూప్‌గా ఉన్నారు. మొదటి స్థానంలో చైనీస్ అమెరికన్లు ఉన్నారు.



# పిల్లలు యూట్యూబ్ వాడకంపై ఆస్ట్రేలియా నిషేధం




**ఆస్ట్రేలియా**
పదహారేండ్లలోపు పిల్లలు యూట్యూబ్ వినియోగించడంపై ఆస్ట్రేలియా ప్రభుత్వం నిషేధం విధించింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి సామాజిక మాధ్యమాలను పిల్లలు వినియోగించడంపై ఇప్పటికే నిషేధం విధించగా, తాజాగా ఈ జాబితాలో యూట్యూబ్‌ను కూడా చేర్చింది. ఈ ఏడాది డిసెంబర్ నుంచి ఈ నిషేధం అమల్లోకి వస్తుంది.ఈ సామాజిక మాధ్యమాల్లో కంటెంట్ పిల్లలకు హానికరంగా మారిందని ఆస్ట్రేలియా ప్రభుత్వం తెలిపింది. సోషల్ మీడియాలో నిర్ణీత వయసు కంటే తక్కువ ఉన్న వారికి ఖాతాలు ఓపెన్ చేసేందుకు అనుమతి ఇచ్చే సంస్థకు 4.95 కోట్ల డాలర్ల జరిమానా విధించనున్నట్టు హెచ్చరించింది.

# యూత్ కాంగ్రెస్ నాయకుల చేతుల మీదుగా చైర్మన్‌లకు ఘన సన్మానం

**మంథని, జూలై 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మంథని, కమాన్పూర్, కాటారం మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లను మంథని యూత్ కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. పూలమాలలు, శుభాకాంక్షలతో అభినందించిన వారు పార్టీ పట్ల నిబద్ధతను చాటారు. ఈ వేడుకలో మంథని, కాటారం, జిల్లా స్థాయి నాయకత్వం పాల్గొని, నాయకత్వ లక్షణాలను ప్రోత్సహించేలా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.



# "ఆకట్టుకున్న యువ వికాస్ వర్క్‌షాప్"

**ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో ఆశ, ఉత్తేజం నింపిన లయన్స్ క్లబ్..**

**చౌటుప్పల్, జూలై 30(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
భవిష్యత్ తరం మానసిక, నైతిక అభివృద్ధికి దోహదపడే గొప్ప కార్యక్రమంగా లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ గ్రేటర్ ఆధ్వర్యంలో "యువ వికాస్ వర్క్‌షాప్" బుధవారం చౌటుప్పల్ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించబడింది. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన 300 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా నాయకులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ విద్యావేత్త, ఎన్విరాన్మెంట్ కౌన్సిల్ జాతీయ సలహాదారులు, పీఎంజేఎఫ్ లయన్ డా. కొమటి రెడ్డి గోపాల్ రెడ్డి ప్రధాన ప్రధాన ప్రసంగం చేశారు. విద్యార్థులకు జీవితం, సవాళ్లను అధిగమించడం, పర్యావరణ పరిరక్షణ, తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల పట్ల గౌరవం, సామాజిక బాధ్యత, ఆరోగ్యం - పరిశుభ్రత వంటి కీలక అంశాలపై స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు "శుభ్రమైన ప్రపంచాన్ని, హరిత ప్రపంచాన్ని, శాంతియుత ప్రపంచాన్ని, ఉత్తమ ప్రపంచాన్ని నిర్మించేందుకు నన్ను నేను అంకితం చేస్తాను అని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రముఖులు రవీందర్ రావు, నరసింహా, శ్రీశైలమ్ పున్నా, లింగయ్య పూస, యాదగిరి రెడ్డి జలే, తిరుపతి రావు పెండ్యాల పాల్గొని విద్యార్థులకు ప్రోత్సాహం అందించారు. పాఠశాల సిబ్బంది, పూర్వ విద్యార్థుల సహకారంతో విజయవంతమైన ఈ కార్యక్రమం, విద్యార్థులకు ఉత్తమ వ్యక్తులుగా ఎదగడానికి ప్రేరణనిచ్చిందని లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ గ్రేటర్ అధ్యక్షుడు లయన్ పూస లింగయ్య, కార్యదర్శి లయన్ యాదగిరి రెడ్డి జలే తెలిపారు.

